## అధ్యాయము 3

# మానవుని పతనము

మానవాళి యొక్క నాటకములో రెండవ సంఘటన విషాదం. ఈ నాటకము ఒక క్రొత్త నటుడి రాకతో మొదలౌతుంది, వాడే సర్పము; పవిత్రత మరియు దేవునితో ఒక పరిపూర్ణమైన సహవాసమనే స్థితి నుండి మానవుని పతనమును ఇది తెలుపుతుంది.

### శోధన మరియు పతనము (3:1–7)

**1దేవుడైన యెహోవా చేసిన సమస్త భూజంతువులలో సర్పము యుక్తిగలదై
యుండెను. అది ఆ స్త్రీతో– ఇది నిజమా, ఈ తోట చెట్లలో దేని ఫలముల నైనను
మీరు తినకూడదని దేవుడు చెప్పెనా" అని అడిగెను. 2అందుకు స్త్రీ– ఈ తోట చెట్ల
ఫలములను మేము తినవచ్చును. 3అయితే తోట మధ్యవున్న చెట్టు ఫలములను
గూర్చి దేవుడు మీరు చావకుండునట్లు వాటిని తినకూడదనియు వాటిని
ముట్టకూడదనియు చెప్పెనని సర్పముతో అనెను. 4అందుకు సర్పము– మీరు
చావనే చావరు. 5ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు
తెరవబడుననియు "మీరు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు
దేవునికి తెలియునని స్త్రీతో చెప్పగా 6స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు"
కన్నులకు అందమైనదియు; వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట
చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతోపాటు తన
భర్తకును ఇచ్చెను; అతడుకూడ తినెను. 7అప్పుడు వారిద్దరి కన్నులు తెరవబడెను.
వారు తాము దిగంబరులమని తెలిసికొని అంజూరపు ఆకులు కుట్టి తమకు
కచ్చడములను చేసికొనిరి.**

**వచనము 1.** దేవుడు ఆదాము మరియు హవ్వలను ఉంచిన తోటలో సర్పము ప్రవేశించింది. ఇక్కడ మనము వాస్తవమైన సర్పము గురించి మాట్లాడాలి. ఎందుకంటే, రచయిత దానిని **దేవుడు చేసిన సృష్టిగా** గుర్తించాడు. అదియు గాక, "సర్పము" అనే అర్థాన్నిచ్చే సాధారణ హెబ్రీ పదాన్ని (נָחָשׁ,

*nachash*) వాడుతున్నాడు, ఈ పదము ఆదికాండము 3లో ఐదు సార్లు మరియు పాత నిబంధనలో ముప్పై ఒక్క సార్లు కనబడుతుంది. *Nachash* అనే పదమును మోషే తన చేతి కర్రను నేల మీద వేసినప్పుడు సర్పముగా మారినదానికి ఉపయోగించబడెను (నిర్గమ 4:3; 7:15). ఇంకా, ఈ పదము అరణ్యములో తిరుగుబాటు చేసిన ఇశ్రాయేలీయులపై దేవుడు పంపిన "దహించు సర్పముల"ను గురించి కూడా ప్రయోగించబడింది. ఇంకా, ఒక ఇత్తడి సర్పమును చేసి దానిని ఒక స్తంభముపై పెట్టమని దేవుడు మోషేకు చెప్పినప్పుడు కూడా ఈ పదము వాడబడింది; ఎవరినైతే పాము కాటువేసిందో వారు స్వస్థత పొందునట్లు ఆ ఇత్తడి సర్పము వైపు చూడాలి (సంఖ్యా. 21:6, 7, 9).[1]

దీనికి అర్థము ఈ సర్పము ప్రాచీన పశ్చిమ ఆసియా సాహిత్యాలలో, ఉదాహరణకు గిల్గామేషు ఇతిహాసంలో[2] చెప్పబడినట్లుగా ఎదో ఒక పురాణాల సంబంధమైన దేవతో లేదా సగ–దైవత్వమున్న సృష్టో కాదు. ఈ ఇతిహాసం కొన్నిసార్లు పరిశుద్ధ గ్రంథంలో ఉన్న కథనానికి మూలంగా భావించబడినప్పటికీ, ఈ మెసొపొతమియ ఇతిహాసాన్ని ఆదికాండము యొక్క రచయిత ఉపయోగించినట్లుగా ఎక్కడ కూడా ఆధారాలు లేవు.

ఆదికాండములో ఉన్న ఈ సర్పాన్ని మొదటి పురుషుడు మరియు స్త్రీని శోధించుటకు అపవాది ప్రయోగించిన ఒక ఆయుధముగా తరువాత కాలపు యూదియా సంబంధిత వ్యాఖ్యాతలు పరిగణిస్తారు. అపోక్రిఫాగా పిలువబడే సొలొమోను యొక్క జ్ఞానము apocryphal Wisdom of Solomon అనే పుస్తక రచయిత, "దేవుడు మనలను పాడు కాకుండా ఉండుటకు సృష్టించాడు; ... కాని అపవాది యొక్క ఈర్ష్య ద్వారా ఈ లోకానికి మరణం ప్రవేశించింది, మరియు ఎవరైతే వాడికి చెందుతారో వారు దానిని అనుభవిస్తారు"[3] అంటాడు.

సాతాను సర్పము ద్వారా మాట్లాడి ఏదెను తోటలో మానవాళి యొక్క తల్లిదండ్రులను మోసగించింది అని నూతన నిబంధన రచయితలు నమ్మారు. యోహాను యేసు యొక్క మాటలను ఈ విధంగా నమోదు చేసాడు: "మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు ... ఆది నుండి వాడు నరహంతకుడై యుండి ... వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధనకు జనకుడునై యున్నాడు" (యోహాను 8:44). అబద్ధ బోధకులు కొరింథులోని క్రైస్తవులను మోసగిస్తున్నారని పౌలు బాధపడి, ఈ వాక్యమును రాసాడు: "సర్పము తన కుయుక్తి చేత హవ్వను మోసపరిచినట్లు మీ మనస్సులును చెరుపబడి, క్రీస్తు ఎడలనున్న సరళత నుండియు పవిత్రత నుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడుచున్నాను" (2 కొరింథీ 11:3). "సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతి కాదు" అని అపొస్తలుడు గట్టిగా ఉద్ఘాటించాడు (2 కొరింథీ 11:14, 15). సాతానుడు

ప్రజలను మోసగించుటకు మారువేషము ధరించుకొనగలడని పౌలు నమ్మాడు. ఆదిలో వాడు స్పష్టంగా చేసింది ఇదే, తమ ఐహిక పరదైసులో ఉన్న మొదటి స్త్రీ పురుషులను శోధించుటకు సర్పమును ఒక ఆయుధముగా ఉపయోగించుకున్నాడు (ప్రకటన 12:9, 15; 20:2 చూడండి).

పరిశుద్ధ గ్రంథ పాఠకుడు ఈ వివరణను సరిగా తెలిసికొనియుండకపోతే పరిశుద్ధ గ్రంథ కథనాలలో ఈ సర్పము అనుకోకుండా కనబడినప్పుడు ఆశ్చర్యపడిపోతాడు. కాని అతడు పొందే విభ్రాంతి సందేహించని స్త్రీ అనుభవించిన దానికంటే గొప్పది కాదు. అకస్మాత్తుగా, దేవుడు చేసిన **సమస్త భూజంతువులలో మిక్కిలి యుక్తిగలదైన** సర్పముతో సంభాషణకు దిగింది. ఇక్కడ ఉపయోగించబడిన "యుక్తి" (עָרוּם, *'arum*) అనే పదము "వివేకము" లేదా"బుద్ధి" (సామెతలు 12:16, 23; 13:16; 14:8, 15, 18; 22:3; 27:12) అని అనువదించినప్పుడు ఒక భావార్థకమైన గుణాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని, దీని అర్థము "యుక్తి" లేదా "వంచన"గా అనువదిస్తే దానికి అభావార్ధకమైన అర్థం వస్తుంది (యోబు 5:12; 15:5; నిర్గమ. 21:14; యెహోషువా 9:4; కీర్తనలు 83:3 చూడండి). ఈ పదము యొక్క అతి ప్రాముఖ్యమైన ప్రయోగము ఆదికాండము 3:1లో సర్పమునకు సంబంధించినది. ఆదికాండము 3:1–5లో, సర్పము యొక్క యుక్తమైన ఆలోచనకును 2:25లో ఆదాము హవ్వల పిల్లలవంటి అమాయకత్వమునకును గల వ్యత్యాసమును చూడవచ్చు.[4]

ఈ సర్పము పురుషునితో కాకుండగా **స్త్రీ** తోనే ఎందుకు మాట్లాడిందో ఇక్కడి కథనంలో స్పష్టంగా చెప్పబడలేదు. స్త్రీలు పురుషులతో పోలిస్తే సహజంగానే సునాయాసంగా లోబడతారని కొందరు అంటారు. పౌలు వివరిస్తూ, "ఆదాము మోసపరచబడలేదు గాని, స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను" (1 తిమోతి 2:14) అని అంటాడు. ఇంకొక ప్రక్క, హవ్వ ఆదాముకంటే ఎక్కువ అమాయకురాలైనట్టుగా ఉండినప్పటికీ ఆమె స్వభావమును గూర్చి చెప్పుటకు పౌలుకు ఏమియు లేదు. కళ్ళు తెరుచుకొని పాపము చేసిన భర్తకు భిన్నంగా, ఆమె మోసపరచబడిందనే పౌలు అంటున్నాడు.[5] "మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలమును" (2:17) తినునప్పుడు నీవు నిశ్చయముగా చచ్చెదవని దేవుడు ఆదాముతో చెప్పినప్పుడు హవ్వ ఇంకా సృష్టించబడలేదు. దీనికి అర్థము హవ్వకు ఆ నిషేధించబడిన వృక్షము గూర్చి ఉన్న కొద్ది జ్ఞానము ఆమె ఆదాము నుండి పరోక్షముగా తెలుసుకున్న సమాచారమే. సర్పమునకు బహుశా ఈ విషయం తెలిసి ఉంటుంది. ఎందుకంటే, దేవుని నిషేధాన్ని మరియు ఆయన గుణాన్ని అపార్థం చేసుకొనే విధంగా వాడు తన ప్రశ్నలను రూపించాడు.

ఈ శోధన చాలా అమాయకంగా అనిపించే ఒక ప్రశ్నతో ప్రారంభమైంది: **"ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేని ఫలములనైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా?"** ఆరంభములో, సర్పము దేవుని ఆజ్ఞను ఎంత అతిశయోక్తిగా

చెప్పిందంటే, దేవుడు ఆ తోట ఫలములలో ఏ ఫలమును కుడా తినుటకు ఆ స్త్రీ పురుషులకు అనుమతినివ్వనట్లుగా చెప్పింది. ఇది చాలా అపార్థమైన భావము ఎందుకంటే దేవుడు వారికి ఒక చెట్టు మినహా మిగతా చెట్లఫలములన్నియు తినుటకు అనుమతినిచ్చాడు; ఇది ఒక్కటి మాత్రమే వారినుండి దూరముగా ఉంచబడెను. ప్రశ్నను ఈ విధంగా రూపించుటలో సర్పము యొక్క వ్యూహము హవ్వ మనస్సులో దేవుని గుణాలను గూర్చి కొంత సందేహాన్ని కలిగించడం.

**వచనములు 2, 3**. దేవుని మాట గుర్తు చేయడం ద్వారా ఆ సర్పమును సరిచేయాలని ప్రయత్నించడం ఇక్కడ ఆ **స్త్రీ** యొక్క జవాబైయున్నది; ఏదేమైనా, అలా చేయుటలో, ఆమె అతిశయోక్తితో మాట్లాడింది. మొదటిగా, దేవుడు వారిని **తోటలోని వృక్షఫలములన్నియు తినుటకు** అనుమతించాడు అని వివరించింది, అయితే దేవుడు ఇచ్చిన ఈ తోట మధ్యలో ఉన్న నిషేధమైన వృక్ష ఫలములను **మీరు తినకూడదు** అనే మాటను ఎక్కువగా ఉద్ఘాటించింది. వారు దానిని తినుటకు నిషేధించబడ్డారు అని చెప్పుటకు బదులు, వారు దానిని **తాకను కూడా** తాకకూడదు, లేదా దాని ఫలితము మరణము అనే మాటను కలిపి చెప్పింది.[6] హవ్వ పలికిన మాటను పరిశీలిస్తే దేవుడు అట్టి ఒక చెట్టును తోట మధ్యలో ఉంచి ఆదాము హవ్వలు దానిని భుజించి సంతోషించకుండా నిషేధించుటలో చాలా కఠినుడు మరియు స్వార్థపరుడు అని హవ్వ అలోచించినట్లు అర్థమిస్తుంది.

**వచనములు 4, 5**. ఈ మాటతో, సర్పము దేవుని గుణాన్ని అబద్ధమాడువానిగా ఆరోపించే ఒక అవకాశమును చూసాడు. వాడు హవ్వతో అంటాడు, "**మీరు చావనే చావరు; ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరవబడుననియు, మీరు మంచి చెడ్డలను ఎరిగిన వారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియును.**" వేరే మాటలలో చెప్పాలంటే, దేవుడు మంచివాడో లేదా కృపగల వాడో కాదు అని, ఆదాము మరియు హవ్వల ఆసక్తిని తన మనస్సులో పట్టించుకోలేదని వాడు వెల్లడి చేసాడు. దేవుని స్వార్థపరుడిగా, ఈర్ష్యపరుడిగా, మోసగాడిగా సర్పము చూపించింది. ఆ నిషేధంలోగల దేవుని నిజమైన ఆలోచన, ఆయన సృష్టించిన ప్రజలను "మంచి మరియు చెడ్డల జ్ఞానము" నకు మరియు "దేవతలవలె" ఉండుటకు వారిని దూరంగా ఉంచడమే అని చెప్పాడు. తన స్వాస్థ్యమైన గమనము నుండి, అనగా దేవుని వలె ఉండుటకు, చావులేని వారుగా (మరణించలేనివారిగా), జ్ఞానవంతులుగా (మంచి మరియు చెడ్డలను గూర్చి) దేవుడు వారిని దూరంగా ఉంచుతున్నాడని సర్పము **స్త్రీకి** పూర్తిగా నూరిపోసింది.

ఆదాము మరియు హవ్వ భూమిపై ఒక పరదేశిలాంటి స్థలములో జీవించారని మనము గుర్తుంచుకోవాలి, అందులో వారి క్షేమానికి సమస్తము ఇవ్వబడింది. దేవుడు తన సృష్టి కేవలం "మంచిది" అని మాత్రమే ప్రకటించలేదు గాని "చాలా మంచిది" అని ప్రకటించాడు. అయినను, దేవుడు శ్రేష్టమైన ఒక మంచిని తమ

నుండి దాస్తున్నాడనే ఆలోచనకు ఆదాము మరియు హవ్వ ఇద్దరు కూడా పడిపోయారు. దేవతలవలె శాశ్వత జీవాన్ని మరియు జ్ఞానమును పొందుకొనుటకు వారి సృష్టికర్తకు అవిధేయులవ్వడం చాలా చిన్న విషయం అని వారు భావించి ఉంటారు. లోతుగా ఆలోచిస్తే, దేవునివలె మారాలనే ఆలోచన వారి హృదయములలో ఆపలేనంతగా గర్వమనే ఒక తీగెను తట్టినట్లుగా ఉంది.

**వచనము 6**. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలమును భుజించుటకు దేవుడు వారిని నిషేధించినప్పటికీ, స్త్రీని ఎదుర్కొన్న ప్రత్యక్ష రుజువు వారిని ఒప్పించుటలో చాలా బలంగా ఉంది. మొదటిగా, అది ఆమెలో భౌతిక ఆశలను రేకెత్తించింది స్త్రీ ఆ వృక్షము తినుటకు మంచిది అని చూచి కొంత క్రొత్తగా మరియు **రుచిగా ఉండే దానిని** ఎలాగైనా రుచించాలని అనుకుంది. 1వ అధ్యాయంలో వివరించినట్లుగా, "మంచిది" (טוֹב, *tob*) అనే పదము సృష్టి అంతటికి అన్వయించబడింది (1:4, 10, 12, 18, 25, 31); సృష్టింపబడిన ప్రతీది దేవుడు ఉద్దేశించిన దానిని మరియు దేనికొరకు చేయబడిందో దానికి తగినట్లుగా ఉండినది. *Tob* అంటే సుందరమైన, లేదా కొంత నైతికమైన అర్థం కూడా గుప్తమై ఉంటుంది; కాని ఇక్కడ దేవుడు ఒకదానిని నిషేధించినప్పుడు అది తినుటకు "మంచిది" అని నిర్ధారించుటలో దేవుని స్థానాన్నే ఆక్రమించాలని అనుకుంది. భౌతికంగా సుందరంగా ఉండే (*tob*) ప్రతీది, ప్రత్యేకించి ఒకని అవిధేయతకు నడిపించినప్పుడు, నైతికంగా మంచిది కాదు. దీనినే నూతన నిబంధన "శరీరాశకు" సంబంధించినదిగా సూచిస్తుంది. అది నిషేధించినవాటి వైపు లేదా ప్రజలు నిరోధించుటకు చాలా కష్టమైన వాటివైపు శారీరకంగా ఆకర్షిస్తుంది (1 యోహాను 2:16).

రెండవదిగా, ఆ వృక్షము కన్నులకు అందమైనదిగా ఉన్నందున ఆ స్త్రీ ఆకర్షించబడింది. ఆఖరుగా, ఆ వృక్షము వివేకమిచ్చు రమ్యమైనదియునై ఉన్నదని ఆమె గుర్తించింది. ఇక్కడ "అందము" (תַּאֲוָה, *tha'*[a]*wah*) మరియు "రమ్యము" (חָמַד, *chamad*) అనే రెండు పదాలు కూడా పది ఆజ్ఞలలో "ఆశించకూడదు" అని అనువదించబడిన పదము నుండే సంక్రమించినవి అనే విషయం ఇక్కడ చాలా ప్రాముఖ్యం. ఈ క్రియారూపమునకు సంబంధించిన పదాలు ద్వితీయోపదేశకాండము 5:21లోని జాబితాలో వస్తాయి, కానీ రెండవది మాత్రమే నిర్గమకాండము 20:17లో ఉంటుంది.[7] ఈ కథ అంతయు కూడా దేవుని ప్రజలకు ఒకటి కనబడే విధానముబట్టి మరియు రమ్యమైనదిగా ఉండేదాన్ని బట్టి వారు పనిచేయుట వలన కలిగే అనర్థాలను ఉదాహరిస్తుంది, ఇంకా ఇది 1 యోహాను 2:16లో ఉన్నట్లుగా "నేత్రాశ మరియు జీవపు డంబం" కు సరిపోయినదిగా ఉంది. తాను చూచిన అందమైన ఫలము భుజించుటలో ఆమె చాలా సంతోషించగలదు అని నమ్మిన ఆ స్త్రీ దానికి నిశ్చేష్టురాలు అవ్వడమే కాకుండా ఆమె "తెలివి" కలిగినదిగా (שָׂכַל, *śakal*) అవుతుందనే బలమైన ఆశ కూడా కలిగి ఉంది. ఆమె

తన జీవితాన్ని మరియు గమ్యాన్ని నిర్దేశించుకొనుటకు తగిన స్వేచ్ఛనిచ్చే తెలివి, వివేకము మరియు జ్ఞానము పొందుతుందని ఊహించింది. ఆమె సర్పము చెప్పిన అబద్ధాన్ని ఖచ్చింతంగా నమ్మింది. కాబట్టి ఇట్టి జ్ఞానము తాను సాధించిన స్వంత కార్యములను మరియు దేవతవలె ఉండే స్థితిని గూర్చి అతిశయించేలా చేస్తుందని చెప్పుకొంది (3:5). ఆమె తన స్వంత ఆశలను నెరవేర్చుకొనుటయే ప్రాథమిక లక్ష్యంగా చేసుకొని, దేవుని హెచ్చరికలను తృణీకరించి తన అహంకార భావాలను అనుసరించినప్పుడు జీవితం కాదు గాని విషాదమే చెలరేగింది.

**హవ్వ దాని ఫలములలో** (ఆ వృక్షము యొక్క) **కొన్ని తీసికొని తిని తనతోపాటు తన భర్తకును ఇచ్చెను, అతడుకూడ తినెను.** హేతుబద్ధీకరణ యొక్క తెలివైన మాటల ద్వారా ఆ పురుషుడు శోధించబడ్డాడని ఈ వాక్యము మనకు చెప్పుటలేదు. ఆయన ఆ స్త్రీ ఫలమును తినుట చూచాడు ఆమె మరణించకుండుట చూచాడు, ఆ తరువాత అదే ఆయన కూడా చేసాడు. దేవునికి కాక తన భార్య మాటకే ఆయన తలొగ్గాడు, ఆమె ఆశలకు ఆయన తలొగ్గాడు. ఆమె మోసగించబడింది మరియు పాపము చేసింది, కాని అతని పాపము దేవుని ఆజ్ఞకు ఉద్దేశపూర్వకమైన అవిధేయత. ఇద్దరును వారి పాపములను చాలా ఆలస్యంగా తెలుసుకున్నారు. స్వతంత్రులుగా చేయబడుటకు బదులు, ఆదాము మరియు హవ్వ మరణమునకు దారితీసే కష్టమైన మరియు భారమైన జీవితమునకు పాత్రులయ్యారు.

**వచనము 7.** ఆ పాపమునకు ప్రతిఫలము చాలా త్వరగానే వారిని వెంబడించింది. అప్పుడు వారిద్దరి **కన్నులు** (అంటే, జ్ఞానము) **తెరువబడెను**. ఇది వారు సాధించిన దైవికమైన జ్ఞానమో లేక మనోవికాసమో కాదు. కాని, వారు ఇంతకు ముందు సరైనదిగా భావించినదే ఇప్పుడు తప్పుగా కనబడింది. తాము దిగంబరులమని వారు తెలుసుకున్నారు. వారి మునుపటి అజ్ఞానాన్ని చాలా ఇబ్బందిపరచే దిగంబరత్వానికి వారు మార్చుకున్నారు, కాబట్టి వారు అంజూరపు ఆకులు తీసుకొని తమకొరకు కచ్చడములను చేసుకుని వారి దిగంబరత్వాన్ని కప్పుకున్నారు.

ఎవరి యొద్ద నుండి దాగుకొనుటకు వారు ప్రయత్నిస్తున్నారు: ఒకరి యొద్ద నుండి ఒకరా లేక దేవుని యొద్ద నుండా? బహుశా దీనికి సమాధానం రెండూ కావచ్చు. మొదటిగా ఈ స్త్రీపురుషులిద్దరూ యుక్త వయస్సుకు వచ్చిన చిన్నపిల్లల వలె ఉన్నారు కాని ఇప్పుడు ఉన్నట్లుండి ఆ దిగంబరత్వము మరియు వారి లింగాలలో ఉన్న వ్యత్యాసాలు తమకెన్నడు సంభవించనదిగా వారు భావించారు. దీనికి తోడు, దేవునికి అవిధేయులైన తరువాత వారు తమ దిగంబరత్వాన్ని గుర్తించారు అనే సత్యము దేవుడు వారిని ఎదుర్కొనుటకు ముందే తాము అపరాధభావనతో నిండుకున్నారు అని మనకు తెలుపుతుంది. వారు తమ సృష్టికర్త సన్నిధిలో ఎడబాటును అనుభవించి, ఆయనతో ఇంకెన్నడూ

మాములుగా ఉండలేకున్నారు.

## పతనమైన దంపతులతో దేవుని సమావేశం (3:8–13)

**[8]చల్లపూటను ఆదామును అతని భార్యయు తోటలో సంచరించుచున్న దేవుడైన యెహోవా స్వరమును విని, దేవుడైన యెహోవా ఎదుటికి రాకుండ తోటచెట్ల మధ్యను దాగు కొనగా. [9]దేవుడైన యెహోవా ఆదామును పిలిచి– నీవు ఎక్కడ ఉన్నావనెను. [10]అందుకతడు– నేను తోటలో నీ స్వరము వినినప్పుడు దిగంబరినిగా నుంటిని గనుక భయపడి దాగుకొంటిననెను. [11]అందుకాయన – నీవు దిగంబరివని నీకు తెలిపినవాడెవడు “నీవు తినకూడదని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివా” అని అడిగెను. [12]అందుకు ఆదాము – నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్షఫలములు కొన్ని నా కియ్యగా నేను తింటిననెను. [13]అప్పుడు దేవుడైన యెహోవా స్త్రీతో – నీవు చేసినది యేమిటని అడుగగా స్త్రీ– సర్పము నన్ను మోసపుచ్చి నందున తింటిననెను.**

**వచనము 8.** ఈ వాక్యభాగములో పరిశుద్ధ గ్రంథ రచయిత మానవీయ భాషను ప్రయోగిస్తున్నాడు: దేవుడు తన సొంత ఆస్తిలో **చల్లని పూటలో** నడక చేస్తున్నవాడిగా ఒక పెద్ద చెట్లున్న సంపదకు యజమానుడిగా రచయిత వివరించాడు. హెబ్రీ భాషలో అక్షరాలా “పగటి గాలి (רוּחַ, *ruach*) వేళలో” అని వ్రాయబడియుంది, అంటే “దినములో బాగా గాలి వీచు సమయము” (NJPSV) లేదా, NRSV వివరిస్తున్నట్లుగా “సాయంత్రపు చల్లని గాలి ఉన్న సమయములో.”

తోటలో సంచరించుచున్న దేవుడైన యెహోవా స్వరము ఆ స్త్రీ పురుషులు ఇద్దరు విన్నారు. ఇక్కడ “స్వరము” అనే పదమునకు మూల పదం קוֹל, *qol*[8] కాని ఇక్కడ బహుశా ఈ పదం సాయంత్రపు పూట వీచే గాలి వల్ల వచ్చే ఆకుల శబ్దమును సూచిస్తుంది, ఎందుకంటే వారి పాపము తరువాత వారితో దేవుడు మాట్లాడినట్లుగా ఈ వాక్యము ఎక్కడా మనకు చెప్పటలేదు.

వ్యక్తులు దేవునితో “నడచెను” అని పరిశుద్ధ గ్రంథము మాట్లాడినప్పుడల్లా, హనోకు, నోవహు, అబ్రహాము మరియు ఇస్సాకు వంటివారు దేవునితో సహవాసము కలిగి ఉన్నారనియు మరియు ఆయన చిత్తముతో వారు ఏకీభవించి జీవిస్తున్నారని (5:22, 24; 6:9; 17:1; 24:40; 48:15) సాదృశ్యంగా చెప్పబడింది. కృపగల ఆ సృష్టికర్త ఆ తోటలో స్త్రీ పురుషులతో “నడచుటకు” (అంటే సహవాసము చేయుటకు) వచ్చాడు; కాని, వారి అవిధేయత వలన, **ఆ చెట్లకున్న** ఆకుల గుబురు మధ్య వారు **దాగుకున్నారు**.

**వచనము 9.** దేవుడు వారిని కొన్ని ప్రశ్నలను అడిగాడు – ఏదో ఆయన వారినుండి సమాచారమును రాబట్టుటకు కాదు, కాని ఆ దంపతులు ఏమి చేసారో

మరియు దేవుని దృష్టిలో వారి ఆత్మీయ స్థితి ఎలా ఉందో వారు నిజముగా గుర్తెరగాలని దేవుడు కోరాడు. దేవుడైన యెహోవా ఆదామును పిలిచి **"నీవు ఎక్కడ ఉన్నావనెను?"** ఇది కొంచెం చమత్కారపు ప్రశ్నే, ఎందుకంటే దేవునికి వారు ఎక్కడ ఉన్నారో తెలుసు.[9] ఆ తోటలో దేవుడు ఆ స్త్రీపురుషులను ఎదుర్కొన్నప్పుడు ఆయన ప్రేమించే తండ్రిలా వారిని బయటకు నడిపి వారి పాపములను ఒప్పుకొనులాగున చేయాలనుకున్నాడు. ఎందుకంటే, సంధి చేయుటకు ఇది మాత్రమే సాధ్యమైన మార్గము అని ఆయనకు తెలుసు.

**వచనము 10**. దేవుని ప్రశ్నకు ఆ పురుషుని సమాధానము ఆ ప్రశ్నను దాటవేయడం. ఆ తోటలో (దేవుని) **స్వరమును విన్నాడు** అని అతడు అన్నాడు. అతడు **దిగంబరిగా** ఉన్నాడు గనుక అది అతనిని **భయానికి** గురిచేసింది, కాబట్టి అతడు దాగుకున్నాడు. అబద్ధము చెప్పుటకు ఆ పురుషునికి ధైర్యము చాలలేదు గనుక, అతడు పాపమును ఒప్పుకొనుకుండా సగం నిజాన్ని చెప్పడు. వాస్తవానికి, ఆ సంభాషణను ప్రక్కదారి పట్టించుటకు ప్రయత్నించాడు. తను పాపము చేయుటకు ముందు, దేవుని స్వరము విన్నప్పుడు తను ఎన్నడు భయపడలేదు, అంతేకాదు తన దిగంబరత్వాన్ని ఎన్నడూ గుర్తించలేదు. తోటలోనికి తన పాపము ప్రవేశించిన తరువాత, విషాదమైన పర్యావసానాలతో సమస్తం మారిపోయింది.

**వచనము 11**. ఆ పురుషుని అర్ధసత్యాన్ని లేదా ప్రశ్నలను దాటవేసే విధానాన్ని దేవుడు అంగీకరించలేదు. మరి రెండు చమత్కారపు ప్రశ్నలతో దేవుడు అతనిని సంధించాడు: అందుకాయన "నీవు దిగంబరివని నీకు తెలిపినవాడెవడు? నీవు తినకూడదని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివా? అని అడిగెను." ఈ అదనపు ప్రశ్నలు ప్రతివాది తన తప్పును తానే ఆరోపించుకొనేట్లుగా చేసే ప్రయత్నముతో వాస్తవాలు తెలియని వకీలు వేసే ప్రశ్నలులాంటివి కావు. వాటికి భిన్నంగా, ఒక జ్ఞానయుక్తమైన తల్లి లేదా తండ్రి తన బిడ్డ ఏమి చేసాడో ఖచ్చితంగా ఎరిగి కూడా విచారణ చేయుట ద్వారా తన బిడ్డ ఒక నిజమైన ఒప్పుకోలు చేయు విధంగా చేసే ప్రశ్నల వలె ఉన్నాయి.

**వచనము 12. పురుషునికి** తన భార్యకు మధ్య కలిగిన ఎడబాటు, ఒకరి సమక్షంలో మరొకరు లేదా దేవుని సమక్షంలో వారిద్దరు ఇప్పుడు అనుభవించిన అవమానము కంటే లోతైనది. ఎందుకంటే, ఆదాము తన స్వీయ అపరాధమునకు హవ్వను బాధ్యురాలినిగా చేయుటకు ప్రయత్నించాడు: **"నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్షఫలములు కొన్ని నా కియ్యగా నేను తింటిననెను."** పురుషుడు చివరికి తన పాపమును ఒప్పుకున్నాడు, కాని అతని భార్యయే దానికి కారణమని చెప్పాడు. సారాంశంలో, "ఇది అంతా ఆమె తప్పిదమే. (అంతా కలిసి) నేను చేసిందల్లా ఆమె ఇచ్చింది తీసుకోవడమే!"[10] అని ఆదాము చెప్తున్నాడు. ఈ బాధ్యతను తన భార్యపై నెట్టే ఈ దురదృష్టకరమైన ప్రయత్నము ఆ పురుషుని తన పాపమునుండి విముక్తునిగా చేయలేదు. అయినను, తను అక్కడ ఆపలేదు.

తరువాత, ఆ స్త్రీని తనకు ఇచ్చినందున దేవుని కూడా ఈ నిందలో పాలివానిగా చేసాడు. ఇక్కడ విషాదకరమైన వైవిధ్యం ఏమంటే, ఆ పురుషునికి ఒక స్త్రీని ఇచ్చుటలో దేవుని ఉద్దేశము ఆమె అతనికి ఒక "సహాయకురాలు"గా ఉండాలని. తన భాగస్వామిని ఆయన ఒక సహాయకురాలిగా భావించుటకు బదులు, ఆటంక కారణముగా, తన ఇబ్బందులకు కారణముగా ఆమెను భావించాడు.

**వచనము 13.** దేవుడైన **యెహోవా ఆ స్త్రీతో** ఒక ప్రశ్నను ఉద్ఘాటించాడు: **"నీవు చేసినది ఏమిటి?"** ఈ ప్రశ్న నిర్మాణం చూస్తే–"ఇది ఏమిటి ... ?"–2:23లో పురుషుడు ఆ స్త్రీని చూచినప్పుడు అతనిలో కలిగిన ప్రతిక్రియను కూడా జ్ఞాపకం చేస్తుంది. అప్పుడు, ఆ పురుషుడు ఆనందంలో ఉబ్బితబ్బిబ్బై "ఇది" అనే మాటను మూడు సార్లు ప్రయోగించాడు. 3:13లోని "ఇది" లో ఉన్న విషయం స్త్రీని సృజించుటలో దేవుడు ఉద్దేశించినది కాదు. తన సహాయకురాలిలో పురుషుడు ఆశించినది కూడా ఇది కాదు.

ఈ స్త్రీ కూడా, పురుషునివలె, తన క్రియలనుబట్టి బాధ్యతను అంగీకరించకుండా తనను తాను పాపమెరుగని దానివలె కనుపరచుకోవలెనని ప్రయత్నించింది. ఆ స్త్రీ, **"సర్పము నన్ను మోసపుచ్చి నందున తింటినసెను."** ఆ స్త్రీపురుషులిద్దరు కూడా వారి అవిధేయతను "నేను తింటిని" అనే మాట ద్వారా ఒప్పుకున్నారు, కాని ఎవరూ నిందను అంగీకరించలేదు. ఆమె ముందు తన భర్త చేసినట్లుగా, హవ్వ కూడా ఎటువంటి పాపము విషయమైన దుఃఖమును మరియు మారుమనస్సును చూపలేదు, కాని ఆ తప్పిదము నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించింది. ఆ బాధ్యతను హవ్వ సర్పముపై నెట్టింది. సర్పము తనను "మోసగించింది" అని ఆమె అన్నప్పుడు, ఆ సర్పము "చాలా ఆకర్షణీయమైన ప్రతిపాదన" చేసింది గనుక దానికి ఆ స్త్రీ లొంగిపోయింది అన్నట్లుగా ఉంది.[11]

2వ అధ్యాయము ముగింపులో ఉన్న సంతోషము మరియు ఉత్సాహానికి బదులు ఈ వాక్యంలో త్వరగా దూసుకొస్తున్న ప్రతిదండన వలన విచారం కమ్ముకుంది. దేవునికి మరియు మానవాళికి, పురుషునికి స్త్రీకి, మానవాళికి మరియు జంతువులకు మధ్య ఇంతకు ముందున్న సమాధానము నశించిపోయింది. కాబట్టి, సృష్టికర్త మాటను పెడచెవిని పెట్టిన కారణాన ఆ నేరస్థులపై రాబోయే ప్రతిదండనకు చదువరి ఇక్కడ సిద్ధపడుతున్నాడు.

## పతనము యొక్క పర్యవసానములు (3:14–19)

పాపము మరియు పాపుల (లేదా పాపము యొక్క మూలముల) క్రమము ఇవ్వబడిన రీతికి వ్యతిరేకంగా దేవుడు వారిపై రప్పించిన ప్రతిదండన తెలుపబడింది. ఈ వాక్యభాగము పురుషుని పాపమును మొదట గుర్తించి (3:9–11), స్త్రీ యొక్క పాపమును తరువాత గుర్తించి (3:12), ఆఖరుకు, సర్పము

యొక్క పాపమును గుర్తించింది (3:13). తీర్పు ముందుగా సర్పముపై (3:14, 15), తరువాత స్త్రీపై (3:16), ఆఖరుగా పురుషునిపై (3:17–19) పలుకబడింది.

## సర్పముపై శాపము (3:14, 15)

**[14]అందుకు దేవుడైన యెహోవా సర్పముతో "నీవు దీని చేసినందున పశువులన్నిటిలోను, భూజంతువు లన్నిటిలోను నీవు శపించ బడినదానివై నీ కడుపుతో ప్రాకుచు నీవు బ్రదుకు దినములన్నియు మన్ను తిందువు. [15]మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదువని చెప్పెను."**

**వచనము 14.** అపరాధ భావమును కలిగించు ప్రయత్నంలో **దేవుడైన యెహోవా** స్త్రీ మరియు పురుషుని ప్రశ్నించినట్లు, సర్పమును ప్రశ్నించలేదు. ఈ మోసపూరిత జీవి వెనుక పడిపోయిన ఆత్మ ఉండుట దీనికి కారణంలా అనిపిస్తుంది ("అపవాదియనియు సాతాననియు పేరుగల ఆది సర్పం," ప్రకటన 12:9), అది రక్షణ సాధ్యతకు వెలుపల ఉన్నదని దేవునికి తెలుసు. కాబట్టి, అతనిని మారుమనస్సులోనికి నడిపించు యత్నం చెయ్యబడలేదు.[12]స్త్రీ యొక్క పాపములో తన పాత్రను గూర్చి వివరణను కోరి సర్పమును గౌరవించుటకు సృష్టికర్త నిరాకరించెను. దానికి బదులుగా, దేవుడు దాని పై మిగిలిన భూజంతువులన్నిటిలోను గొప్ప కష్టమును ఘోషించి దానిని **శపించెను. "కడుపుతో ప్రాకుచు నీవు బ్రదుకు దినములన్నియు మన్ను తిందువు"** అని ఆయన చెప్పెను.

శపించబడుటకు ముందు సర్పములు సరీసృపాలు కాదని ఈ కథనం యొక్క అర్థమా? పాఠకులు ఈ సన్నివేశాన్ని సర్పాలు తమ కాళ్ళను ఎలా పోగొట్టుకొనెనో వివరించు రోగోత్పత్తి శాస్త్రం పురాణంగా భావించకూడదు. అలాంటి అనువాదం పాత నిబంధన ముగింపు తరువాత ఉద్భవించిన కొన్ని యూదా మత పుస్తకాలైన పాలస్తీనా యొక్క తర్గుం (Targum of Palestine) వంటి వాటి పై ఆధారపడియుంది, "నీ కడుపుతో నీవు ప్రాకాలి, మరియు నీ కాళ్ళు నరికివేయబడును"[13] అని అది చెబుతుంది. మరికొన్ని సర్పముల వలె, తూర్పు ఆఫ్రికాలోని నల్ల మంబా సర్పములవంటివి, తమ శరీరం యొక్క ముందు భాగమును పైకి లేవనెత్తి కూడా శరవేగంగా ప్రయాణించగలవు, ఈ సర్పం –ఎక్కువ సర్పముల కదలికకు సామాన్య మార్గమైనట్లు– తన కడుపుతో ప్రాకవలెనని బైబిల్ యొక్క సులువైన భావం కావచ్చు.

ప్రాకుట చిత్రాత్మకం కావచ్చు. ఆదికాండం 9:13 ఇంద్రధనుస్సు నూతన విషయం కాకపోవచ్చని, కాని "నూతన ప్రాధాన్యత"[14] సంతరించుకుందని

చెప్పుచున్నట్లే, సర్పములు ప్రాకుట కూడ ఒక నూతనమైన విధంగా చూడవచ్చు. ఈ శాపము ఘోషించబడిన తరువాత, కడుపుతో ప్రాకుట మరియు మన్ను తినుట (లేక నాకుట) ఓటమికి మరియు వ్యక్తిగత అవమానమునకు సామాన్య రూపకాలయ్యాయి. ఉదాహరణకు, కీర్తనలు 72:9 ప్రకారం, "అరణ్యవాసులు అతనికి లోబడుదురు, అతని శత్రువులు మన్ను నాకెదరు" (యెష. 49:23; 65:25; మీకా 7:17 చూడండి). సర్పములు, వాస్తవానికి, మన్ను తినవు లేక మన్నులో జీవించవు; కాని ఇది పాప పరిణామాలకు చిత్రాత్మక జ్ఞాపిక కావచ్చు. సుళువైన మరియు మోసపూరితమైన శోధనను ఎదుర్కొనువారు, సర్పము యొక్క అబద్ధముల సందర్భంలో జరిగినట్లు, పాపము తరువాత కలుగు అవమానమును గుర్తుంచుకోవాలి.

**వచనం 15**. దేవుడు సర్పముపై ఘోషించిన శాపం మరియు నీకును **స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను**. "సంతానము" అని అనువదించబడిన ఏకవచన సముదాయ నామవాచకమైన హెబ్రీ పదం זֶרַע, (*zera'*), సాధారణంగా "భావితరాలను" లేక "సంతతి"ని సూచిస్తుంది; కాని కొన్ని సార్లు అది "సమూహమంతటిని సంగ్రహించు ఒక వ్యక్తిని"[15] కూడ సూచిస్తుంది. కాబట్టి, శాపం యొక్క మొదటి భాగం, స్త్రీ సంతానమునకు (మానవజాతి) మరియు సర్ప సంతానమునకు (సర్ప జాతి) మధ్య వైరమును సూచించవచ్చు, ఇందునిమిత్తం సర్పములు మానవుల మడమలపై కాటువేయక ముందే మానవులు వాటిని చితకద్రొక్కుతారు. సర్పము యొక్క తలకు ఏమి జరిగిందో అదే స్త్రీ సంతతి యొక్క మడిమెకు కూడ జరుగుతుంది. వాక్యభాగం ఇలా చెబుతుంది, "**అది నిన్ను తల మీద కొట్టును** [שׁוּף, *shup*]; **నీవు దానిని మడిమె మీద కొట్టుదువు** [*shup*]." వాక్యం యొక్క ఆరంభములో మరియు అంతంలో ఒకే హెబ్రీ పదము వాడబడెను గనుక, NIV అనువాదకులు ఇచ్చిన తేడాకు కొంత వరకు న్యాయమును చేకూర్చవచ్చు: "అతడు నీ తలను చితకద్రొక్కును, మరియు నీవు అతని మడిమె మీద కొట్టుదువు." దెబ్బను ఎదుర్కొన్న ప్రతివానికి వేర్వేరు పరిణామాలు ఉంటాయని ఇది సూచిస్తుంది. అది సర్పంపై పడి తలను చితకద్రొక్కెను గనుక అది ప్రాణాంతకం; కాని స్త్రీ సంతతికి మాత్రం గాయపడిన మడెమ మాత్రమే ఉంటుంది కాబట్టి అది కేవలం నొప్పి కలిగిస్తుంది.[16]

వాస్తవంగా, మానవులకు మరియు జంతువులకు మధ్య సామరస్యం ఉందని బైబిల్ కథనాలు చెబుతాయి, మరియు మొదటి మనిషి వాటిని పాలించి వాటికి పేర్లు పెట్టెను (2:19, 20). ఏదేమైనా, వాస్తవిక శోధనలో సర్పము జంతువుల యొక్క ప్రతినిధిగా మరియు స్త్రీని మోసపుచ్చుటకు సాతాను యొక్క అస్త్రముగా పనిచేసినందున, ఈ శాంతిపూర్వక అనుబంధం తెగిపోయింది. మానవులతో పాటు జంతువుల రాజ్యం కూడ పడిపోయెను. వారి మధ్య నిత్యము నిలచు వైరము

కలిగింది (రోమా 8:20–22).

స్త్రీ సంతతి సర్పము యొక్క తలను అణగద్రొక్కుట అనునది రక్షణ గురించిన నిరీక్షణ లేక మెస్సీయ వాగ్దానం యొక్క సందేశం అను వ్యాఖ్యను అనేకమంది పండితులు నమ్మరు.[17] అయినప్పటికీ, సర్పములు మరియు మానవులకు మధ్య నిత్యముండు వైరముకంటే లోతైన అర్థం దానిలో ఉన్నదనిపిస్తుంది. సర్పము కేవలం మాట్లాడు పాము మాత్రమే కాదు (3:1). అది ఆ జీవి ద్వారా మానవ శోధన మరియు పతనమును కలిగించుటకు మాట్లాడిన సాతానుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది ఆదికాండం కథనంలో స్పష్టంగా లేదు. సర్పము వెనుక ఉన్న నిజమైన శత్రువు లోకమంతటిని మోసపరచు సాతాను" (ప్రకటన 12:9; యోహాను 8:44 కూడ చూడండి) అని సమయం గడచిన కొలది బయలుపరచబడుతుంది.

పేరు ఇవ్వని స్త్రీ సంతానము యొక్క సంబోధన కూడ ఇలాటిదే అయ్యుండవచ్చు. తక్షణ సందర్భంలో, సంతానము (వారసుడు)–హవ్వ వాగ్దానమును అర్థం చేసుకున్నంత వరకు–కయీను హేబెలును హతమార్చిన తరువాత ఆమె షేతును గుర్తించెనని అనిపిస్తుంది. తన మూడవ కుమారుని జననం తరువాత, ఆమె ఇలా అనెను, "కయీను చంపిన హేబెలునకు ప్రతిగా దేవుడు నాకు మరియొక సంతానమును [*zera'*, 'seed'] నియమించెను" (4:25). సర్పము యొక్క తలను అణగద్రొక్కుట అను భావములో ఉన్న విషయములన్ని హవ్వకు తెలియనప్పటికీ, ఏదో ఒక విధంగా దేవుని వాగ్దానం తన వారసులలో (సంతానము) ఒకని ద్వారా నెరవేరుతుందని ఆమె తలంచెను.

ఆదికాండము 1–11లో మానవ పాపం మరియు తిరుగుబాటు చిత్రీకరించబడినప్పటికీ, సంతానమును గూర్చి దేవుని వాగ్దానం ఆదికాండము యొక్క ముఖ్య నేపథ్యంగా మారింది. అంతేగాక, మానవుని పాపం మరియు తిరుగుబాటు మధ్యన కూడ, దేవుడు, తన కృపలో–మొదటిగా సాధారణ రూపంలో స్త్రీ ద్వారా, తరువాత విశేషంగా అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు యూదా ద్వారా–ఆయన యొద్ద వారికి మరియు వారి సంతతివారికి సమృద్ధిగా ఆశీర్వాదములు ఉన్నాయని వాగ్దానం చేసెను. కాలం గడచినకొలది, యూదులు ఆదికాండము 3:15 యొక్క అంతిమ నెరవేర్పు మెస్సీయ యొక్క రాకలో చూసారు.[18]

సర్పముతో దేవుడు చేసిన ప్రకటనను మనం *protoevangelium* ("మొదటి శుభవార్త [సువార్త]") అని అర్థం చేసుకోవాలా? దానికి జవాబు "అవును" మరియు "కాదు." వాస్తవిక సందర్భంలో, స్త్రీ హవ్వ, మరియ కాదు, మరియు ఆమె "సంతానం" భావితరాలను సూచిస్తుంది; అది యేసు యొక్క కన్య జన్మను గూర్చి విశేష వాగ్దానం కాదు.[19] అయినను, లేఖనం యొక్క పూర్ణ భావమును గూర్చి, William Sanford LaSor, ఈ ప్రకటన చేసెను,

ఇంకను తెలియపరచబడని మానవ జాతికి చెందిన ఒక వ్యక్తి సాతాను యొక్క సర్పమును నాశనం చేయుట ద్వారా దేవుని విమోచనా ప్రణాళికలో ముఖ్య పాత్ర పోషించుటయందు నాకు దీని పూర్ణ అర్థము కనిపిస్తుంది. ఆ విధంగా, ఈ వాక్యభాగం నిజముగా మొదటి శుభ వర్తమానము యొక్క వివరణయే.[20]

ప్రవచనం యొక్క నెరవేర్పు యేసు క్రీస్తులో మరియు ఆయన ద్వారా ముగింపుకు వస్తుంది (గలతీ 3:8–29; ఎఫెసీ 1:3–14 చూడండి). రోమాలో ఉన్న క్రైస్తవులకు తాను వ్రాసిన లేఖ యొక్క ముగింపులో కూడ పౌలు ఆదికాండము 3:15ను ప్రతిధ్వనించెను, "సమాధాన కర్తయగు దేవుడు సాతానును మీ కాళ్లక్రింద శీఘ్రముగా చితక త్రొక్కించును" (రోమా 16:20).

## స్త్రీ పై తీర్పు (3:16)

**[16]ఆయన స్త్రీతో, "నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను, వేదనతో పిల్లలను కందువు" నీ భర్తయెడల నీకు వాంఛ కలుగును, అతడు నిన్ను ఏలునని చెప్పెను.**

**వచనం 16**. పై దేవుని తీర్పు సృష్టిలో తన పాత్రకు భంగం కలిగించింది. **ఆమె**, ఆదాముకు భార్యగా, ఆయనకు సాటియైన సహాయంగా సృష్టించబడెను; మరియు ఆమె అతని పిల్లలకు తల్లి కావలసియుంది (2:18, 23, 24). పిల్లలను కనుట సృష్టికర్త యొక్క తీర్పులో భాగం కాదు; "విస్తరించి భూమిని నింపుట" (1:28). వాస్తవిక ఆశీర్వాదంలో భాగము. తేటగా, పాపము ప్రవేశింపక మునుపు స్త్రీ అతి తక్కువ నొప్పితో లేక ఎలాంటి నొప్పి లేకుండా పిల్లలను కనియుండును. శాపం తరువాత, స్త్రీ తన విశేషమైన పాత్ర, జన్మనిచ్చుటలో, దేవుడు [ఆమె] ప్రసవవేదనను మిక్కిలిగా హెచ్చించెను. ఇది పాపం యొక్క పరిణామము.

దానికి తోడు, "నీ భర్తయెడల నీకు వాంఛ కలుగును, అతడు నిన్ను ఏలును" అని దేవుడు చెప్పెను. ఈ కథనం యొక్క ఖచ్చితమైన అర్థమును గూర్చి గొప్ప విభేదాలు ఉన్నాయి. "వాంఛ" అనునది స్వాభావికంగా లైంగిక వాంఛ అని కొందరు ఆలోచిస్తారు. "అతడు నిన్ను ఏలును" అను కథనం పురుషుడు స్త్రీ యొక్క నాయకత్వమునకు ఒప్పుకొని నిషేధించబడిన చెట్టు ఫలమును తిన్నప్పుడు "సృష్టిలో నియమించబడి పతనంలో తిరగబడిన అధికార గొలుసును (దేవుడు–పురుషుడు–స్త్రీ) పునరుద్ఘాటిస్తుంది" అని అనవచ్చు.[21]

ఈ ఆలోచనకు ఎక్కువ మద్దతులేదు, ఎందుకంటే స్వాభావిక లైంగిక వాంఛ మానవ జాతిని ఉత్పత్తి చేయుటకు స్త్రీ మరియు పురుషునిలో ఆరంభంలోనే నిర్మించబడిన లైంగిక ఆశీర్వాదంలో భాగమైయుంది. అది పతనము తరువాత పాపమునకు శిక్ష కాదు. అంతేగాక, స్త్రీ పై పురుషుడు యేలుట సృష్టి నుండే

దేవుడు వివాహంలో ఆశించిన సరైన అనుబంధము (2:18–25). ఇది హవ్వ కంటే ఆదామునకు ఇవ్వబడిన ప్రాధాన్యతలో కనిపిస్తుంది, మరియు ఇతర జంతువులకు పేర్లు పెట్టినట్లే అతడు ఆమెకు కూడ పేరు పెట్టుటలో ఇది ప్రదర్శించబడెను (1 కొరింథీ 11:3, 7–12; 1తిమోతి 2:12–15) లో పౌలు యొక్క తర్కము కూడ చూడండి.

ఒకవేళ "వాంఛ" తన భర్త పట్ల స్త్రీ యొక్క స్వాభావిక లైంగిక వాంఛను సూచిస్తే, భర్త భార్యను ఏలుట కూడ వైవాహిక అనుబంధంలో దేవుడు ఆశించిన స్వాభావిక కార్యమని తార్కికంగా చెప్పవచ్చు. అయితే, "వాంఛ" యొక్క నామవాచక రూపం (תְּשׁוּקָה, *th^e^shuqah*) పాత నిబంధనలో కేవలం మూడు సార్లు కనిపిస్తుంది. ఆదికాండములోని పై వాక్యభాగమునకు తోడుగా, పరమగీతం 7:10లో, తన వరుని పట్ల వధువు యొక్క వాంఛను తెలుపు కథనంలో చూడవచ్చు, "నేను నా ప్రియునిదానను, అతడు నాయందు ఆశాబద్ధుడు." "ప్రేమ మరియు ఆనందం" సందర్భంలో ఇది స్వాభావిక వాంఛ; అయితే ఆదికాండము 3:16లో, స్త్రీ అనుభవించవలసిన వాంఛ "పాపం మరియు తీర్పు సందర్భంలోనిది."[22]

ఈ వాక్యభాగముల మినహా, "వాంఛ" (*th^e^shuqah*) మరొకచోట కూడ ఉపయోగించబడెను: ఆదికాండము 4:6, 7. కయీను దేవునికి అంగీకారయోగ్యమైన అర్పణను ఇచ్చుటలో విఫలమైన సందర్భంలో ఇది కనిపిస్తుంది. అంతేగాక, ఆదికాండము 3:16లో "ఏలుట"కు (מָשַׁל, *mashal*) ఉపయోగించబడిన పదం కూడ, ఈ సందర్భంలో కనిపించుట ప్రాముఖ్యమైన విషయం; మరియు ఈ రెండు స్థలాలలోనే *th^e^shuqah* మరియు *mashal* కలిపి ఉపయోగించబడెను. రెండు సందర్భాలు పాపం మరియు శిక్షపై దృష్టి ఉంచుతాయి.

> యెహోవా కయీనుతో–"నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసినయెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయనియెడల వాకిట పాపము పొంచియుండును; నీ యెడల దానికి వాంఛ [*th^e^shuqah*] కలుగును నీవు దానిని ఏలుదువనెను [*mashal*]" (4:6, 7).

కయీనుపై దాడిచేసి అతనిని హతమార్చుటకు వాంఛకలిగిన క్రూరమృగముగా పాపం వర్ణించబడెను. ఆ వాంఛను "ఏలుట" ("ప్రవీణత") అభ్యసించమని మరియు దానికి లొంగిపోవద్దని దేవుడు కయీనును సవాలు చేసెను.

హెబ్రీ పదం *mashal* యొక్క అర్థం "ఏలుట" లేక "అధికారం"లో ఉండుట, మరియు ఇది ఎక్కువగా రాజులు తమ ప్రజలపై చేయు అధికారమును సూచిస్తుంది.[23] పదాల యొక్క పదకోశ ఉపయోగమును మరియు ఈ రెండు కథనాల యొక్క నిర్మాణ సమాంతరాలను మనం ఖచ్చితంగా తీసుకొన్నయెడల,

3:16 యొక్క అర్థం 4:6,7కు సాదృశ్యంగా ఉండి, పాండిత్యమునకు మరియు ఏలుటకు మధ్య ఘర్షణను సూచిస్తుంది. పాపము కయీనును ఏలుటకు ఆశించినట్లే, స్త్రీ పురుషుల మధ్య అధికార పోరు ఉంటుంది. 3:16లో స్త్రీపై ప్రకటించిన తీర్పులో భార్య మరియు భర్త మధ్య గల వాస్తవిక అనుబంధం నిలువలేదు. అది పాపం మరియు పతనం ద్వారా నాశనం చేయబడెను. సారాంశంగా, "అతడు నిన్ను ఏలును" అను కథనం స్త్రీ పై పురుషుని అధికారం చెలాయించుటకు ఒక ఆజ్ఞ కాదు.

## పురుషునిపై తీర్పు మరియు నేలపై శాపం (3:17–19)

**[17]ఆయన ఆదాముతో– నీవు భార్య మాట విని–తినవద్దని నేను నీ కాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక; నీ నిమిత్తము నేల శపింపబడియున్నద "ప్రయాసముతోనే నీవు బ్రదుకుదువు" దినముల న్నియు దాని పంట తిందువు; [18]అది ముండ్ల తుప్పలను గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములో పంట తిందువు. [19]నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు; ఏలయనగా నేలనుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక; తిరిగి మన్నైపోదువని చెప్పెను.**

**వచనాలు 17.** పురుషునిపై తీర్పు సర్పము మరియు స్త్రీ కంటే ఎక్కువ సమగ్రమైనదిగా ఉంది, ఎందుకనగా దేవుని హెచ్చరికలను విస్మరించి తన **భార్య** యొక్క సలహాను పాటించుట ద్వారా అతడు పాపమునకు మరి ఎక్కువ బాధ్యుడాయెను.

హెబ్రీ మూల గ్రంథమును ప్రతిబింబిస్తూ, NASB దేవుడు ఆదాముతో మాటలాడెనని చెబుతుంది. ఇక్కడ యెహోవా ఉపయోగించిన "పురుషుడు" (אָדָם, *'adam*) అను సాధారణ పదమునకు మొట్టమొదటి సారిగా వ్రాయబడిన వ్యక్తిగత పేరు: "ఆదాము" అని చెబుతారు. అయితే, ఇక్కడ మనం చూస్తున్న హెబ్రీ నిర్మాణమే (לְאָדָם, *l*[e]*'adam*) ఇంతకుముందు 2:20లో కూడ చూడవచ్చు, దానిని "ఆదాము కొరకు" అని NASB అనువదిస్తుంది. ఆ వాక్యభాగంలో పదం వ్యక్తిగత పేరుగా అర్థం చేసుకొనవలసియుంటే, 3:17 ఆదాము పేరుగా ఆ పదము రెండవసారి ఉపయోగించుటను గుర్తిస్తుంది. 3:17కు ముందు మిగిలిన సన్నివేశాలలో ఎక్కువ సార్లు, ఆ పదం ముందు ఉపపదమును (הָאָדָם, *ha'adam*) చూడవచ్చు, మరియు అది "the man" అని అనువదించబడెను.

ఆదాముపై సూటిగా దాడి చెయ్యకుండా దేవుడు తీర్పులో కృపను చూపెను. ఆయన శాపం కేవలం మనుష్యుని మీదే గాక, ఆదాము మరియు తన కుటుంబం తినుటకు ఆహారమును ఉత్పత్తి చేయు నేలపై కూడ వచ్చెను.

ఆ తరువాత, ముండ్లతుప్పలను గచ్చపొదలను మొలిపించుట ద్వారా నేల

ఆహారము పండించుటకు పురుషుని ప్రయాసను వ్యతిరేకిస్తుంది. ఇక్కడ వ్యంగ్యత స్పష్టంగా చూడవచ్చు: మొదటిగా, సమృద్ధిగా ఫలములు ఇచ్చు తోటను సేద్యపరచుటలో పురుషుడు సంతోషించవలసియుంది, అయితే ఇప్పుడు ఆ నేల తనకు విరోధిగా మారెను. అది ముండ్లతుప్పలను మరియు గచ్చపొదలను మొలిపించును మరియు పురుషుడు జీవించుటకు ప్రయాసముతోను మరియు చమటతోను దానితో పోరాడవలెను. పని అనేది పతనము వలన పురుషునిపై వచ్చిన శాపం కాదు; మానవుని శారీరిక మరియు మానసిక ఆరోగ్యం కొరకు ఏదో ఒక విధమైన పని అవసరం 2:15పై క్రింద ఉన్న వ్యాఖ్యలు చూడండి). ఏదేమైనా, పంటను పండించుటకు కొన్ని గంటల పాటు ఎండలో ప్రయాసపడిన పురాతన వ్యవసాయ సముదాయమునకు, ఇట్టి అధికము చేయబడిన కృషి కష్టతరము. ఆదాము మరియు హవ్వ దగ్గర అన్ని ఉన్నాయి గాని, మరి ఎక్కువ సంపాదించు ప్రయత్నంలో వాటిని కోల్పోయారు. అనేకమంది శతాబ్దాలుగా వారి అడుగుజాడలలో నడుస్తూ, "స్వప్రయోజనాలను పొందుటలో ఓటమి పాలయ్యారు."[24]

మానవుని పై తీర్పు యొక్క రెండవ భాగం శారీరక మరణం. మానవులు నేల నుండి సృష్టించబడి వారు బ్రతుకుటకు కావలసిన వాటిని నేల సుళువుగా అందించు పరదైసులో పెట్టబడెను. ఏదేమైనా, లోకములోనికి పాపము ప్రవేశించిన తరువాత, నేల తనకు శత్రువై తుదకు మరణంలో అతనిని తిరిగి తీసుకొనునట్లాయెను: "... **ఏలయనగా నేలనుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక, తిరిగి మన్నైపోదువని చెప్పెను.**" పతనం యొక్క ఘోర విషాదం ఏమిటంటే దేవుని స్వరూపంలో చేయబడిన మానవుడు భూలోక పరదైశులో సృష్టికర్తతో నిత్య సహవాసంతో ఆశీర్వదించబడవలసియుండి, తన జన్మ హక్కును పోగొట్టుకొని తాను వచ్చిన నేలకు తిరిగి వెళ్ళాడు.

దేవుడు జరిమానాలు మరియు శాపములు ప్రకటించిన తరువాత, చివరిది మానవుని మరణమును గూర్చి చెప్పుట, ఆదాము మరియు హవ్వ భవిష్యత్తును గూర్చిన ప్రతి నిరీక్షణను కోల్పోయుంటారు. దేవుడు 2:17లో హెచ్చరించిన విధంగా పాపము చేసిన వెంటనే మరణ శిక్ష విధించియుండవచ్చు. అయినప్పటికీ, రానున్న తీర్పులకు మధ్యలో, స్త్రీ సంతానము సర్పము యొక్క తలను చితక ద్రొక్కును అను స్పష్టతలేని ప్రవచనంలో మానవుడు నిరీక్షణను పొందెను (3:15)

## క్రొత్త పేరు మరియు క్రొత్త ముసుగు:

## ఆదాము విశ్వాసం మరియు దేవుని కృప (3:20, 21)

**[20]ఆదాము తన భార్యకు హవ్వ అని పేరు పెట్టెను, ఏలయనగా ఆమె**

**జీవముగల ప్రతివానికిని తల్లి. [21]దేవుడైన యెహోవా ఆదామునకును అతని భార్యకును చర్మపు చొక్కాయిలను చేయించి వారికి తొడిగించెను.**

**వచనం 20**. హవ్వ (חַוָּה, *Chawwah*) అను పేరు ధ్వనిశాస్త్ర పరంగా "జీవముగల" అను అర్థం కలిగిన חַי (*chay*) అను పదముతో అనుబంధం కలిగియుంది, మరియు LXXలో అది Ζωή (*Zōē*) అని అనువదించబడెను. పదాల ఆటను ఉపయోగిస్తూ, ఆదాము ఆమెకు ఆ పేరు ఎందుకు పెట్టేనో ఆదికాండము యొక్క రచయిత వివరించుచున్నాడు. ఈ వివరణ కొంత సమస్యాత్మకముగా ఉంది, ఎందుకంటే ఆమె జీవముగల ప్రతివానికి తల్లి కాబట్టి అతడు ఆమెను "హవ్వ" అని పిలచెనని అది ప్రకటిస్తుంది. హవ్వ ఇంకా పిల్లలెవ్వరికీ జన్మనివ్వలేదు కాబట్టి, ఆదాము ఆమెను **"జీవముగల ప్రతివానికి తల్లి"** అని ఎలా చెప్పగలడు? "ఉంది" అనే పదం సమగ్ర రూపంలో ఉన్న హెబ్రీ క్రియాపదం, మరియు ఇది ముందుగా ముగించబడిన కార్యమును సూచిస్తుంది. ఒకరు క్రియ యొక్క అసమగ్ర రూపమును, అనగా భవిష్యత్తులోని అపరిపూర్ణ కార్యమును సూచించు క్రియ కొరకు ఆశించియుండవచ్చు, మరియు దాని అనువాదం ఇలా ఉంటుంది "ఆమె జీవముగల ప్రతివానికి తల్లి అవుతుంది." "ఉంది" అనే క్రియాపదం "ప్రవచన సమగ్రత"కు ఉదాహరణగా ఉంది, అది భవిష్యత్తులో జరగవలసిన సన్నివేశాలను వ్యక్తపరచుటకు సమగ్రతను ఉపయోగిస్తుంది. ఈ కార్యము జరుగుతుందని ఎంత నిశ్చయమంటే అది ముందుగానే జరిగిందని చెప్పవచ్చు.

హవ్వకు పేరు పెట్టుట ఆదాము విశ్వాసము యొక్క ప్రదర్శన, వారు మరణము ద్వారా బెదిరించబడినప్పటికీ, ఈ భూమిపై వారు మొదట మరియు చివరి మానవులని ఆయన నమ్మలేదు. హవ్వ వాగ్దాన సంతానమునకు (3:15) జన్మనిస్తుందని, అతడు సర్పము యొక్క తలను చితక ద్రొక్కుతాడని ఆదాము నమ్మి, భవిష్యత్తు వైపుకు చూసెను.

**వచనం 21**. ఆదాము మరియు అతని భార్యను తోటలో నుండి బయటకు పంపుటకు ముందు వారిని చర్మపు చొక్కాయిలతో కప్పుట దేవుని యొక్క చివరి కృపా కార్యం, ఇది 3:7లో వారు తమను తాము అంజూరపు ఆకులతో కప్పుకొనుటకు చేసిన దయనీయమైన ప్రయత్నానికి భిన్నంగా ఉంది. "చొక్కాయి"కి (כְּתֹנֶת, *kuthoneth*) హెబ్రీ పదం ఒక వ్యక్తి శరీరమునకు అంటి పెట్టుకొని ఉండు "లోదుస్తులను" సంభోదిస్తుంది, సామాన్యంగా పొడవు చేతులు లేక కురచ చేతులు కలిగి మోకాళ్ళు లేక మడమల వరకు ఉంటుంది (37:3; నిర్గమ. 28:4 చూడండి).[25] "చర్మము" (עוֹר, *'or*) అనే పదం జంతువు యొక్క తోలును సూచిస్తుంది (27:16; లేవీ. 4:11 చూడండి). రచయిత ఇక్కడ బలి యొక్క నేపథ్యాన్ని వివరించనప్పటికీ, ఆదాము మరియు హవ్వల పాపము వలన

ఒక జంతువు మరణించుట అనివార్యం అనిపిస్తుంది. స్పష్టంగా, దేవుడు ఒక జంతువును చంపి దాని చర్మమును ఆ దంపతులకు వస్త్రములు చేయుటకు ఉపయోగించెను. దేవుడు పురుషుని మరియు స్త్రీని తోటలో నుండి బయటకు బహిర్గతంగా పంపడు, కాబట్టి ఆయన వారికి రక్షణ వస్త్రాలను ఇచ్చెను. అయినను, తమ వస్త్రములు వారి పాపమునకు మరియు వారి నిర్దోష కాలము అంతరించెననుటకు జ్ఞాపికగా ఉన్నాయి.

## తోట నుండి బహిష్కరణ (3:22–24)

**[22]అప్పుడు దేవుడైన యెహోవా- ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకని వంటివాడాయెను. కాబట్టి అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవవృక్షఫలమును కూడ తీసుకొని తిని నిరంతరము జీవించునేమో అని**
**[23]దేవుడైన యెహోవా అతడు ఏ నేలనుండి తీయబడెనో దాని సేద్యపరచుటకు ఏదెను తోటలోనుండి అతని పంపివేసెను. [24]అప్పుడాయన ఆదామును వెళ్ళగొట్టి ఏదెను తోటకు తూర్పుదిక్కున కెరూబులను, జీవవృక్షమునకు పోవు మార్గమును కాచుటకు ఇటు అటు తిరుగుచున్న ఖడ్గజ్వాలను నిలువబెట్టెను.**

**వచనం 22.** సర్పము గూర్చిన ప్రవచనము (3:5) వక్రీకృత రూపంలో నెరవేర్చబడెను. ఆదాము మరియు హవ్వలను తోట నుండి బహిష్కరించుటకు **దేవుడు** ఈ కారణం ఇచ్చెను: **"ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకనివంటివాడాయెను."** యెహోవా ఉపయోగించిన "మన" అను బహువచనం ఆయన సభలో కూడిన దూతల సమూహమును సూచించవచ్చు (1:26పై వ్యాఖ్యలను చూడండి). ఇదే అయ్యుండవచ్చు, ఎందుకనగా ఆదాము మరియు హవ్వ తోటను విడచిన తరువాత, "జీవవృక్షమునకు పోవు మార్గమును కాచుటకు కావలిగా" ఆయన "కెరూబులను" (దూతలను) నిలబెట్టెనని 24వ వచనం తెలియజేస్తుంది.

దేవునికి మరియు తన దూతల సమూహానికి, అనుభవపూర్వకంగా కాదు గాని, దేవుడే మంచి–చెడుల మధ్య తేడాను నిర్ధారిస్తాడను అవగాహన ద్వారా "మంచి మరియు చెడు" తెలుసు.[26] దేవుని స్వభావం, గుణం లేక చిత్తమునకు విరుద్ధమైన ప్రతి విధమైన వైకరి, ఆలోచన, లేక కార్యము పాపమే. ఆదాము మరియు హవ్వ గర్వముతో దేవుని వలె "జ్ఞానులగుటకు" (3:6) నిర్ణయించుకొని, బయలుపరచబడిన దేవుని చిత్తమునకు అవిధేయముగా తెలివిని సంపాదించి వారి స్వయం ప్రతిపత్తిని చాటుట ద్వారా, క్లుప్తంగా వారు తమ స్వాతంత్ర్యమును తెలియపరచి తమకు తామే "దేవుడు" కాగోరెను.

దేవుని సింహాసనమును తీసుకోవాలనే వారి ఆశకు తోడుగా, వారు జీవవృక్ష

ఫలమును తీసుకొనుటకు ప్రయత్నించి, దానిని తిని, పాపములో నిరంతరం బ్రదుకుట ద్వారా, వారు దేవుని విరుద్ధంగా వారి అహంకారమును మరియు తిరుగుబాటును సమ్మేళనం చేస్తారు. భౌతిక జీవితం మానవునికి దేవుని కృప ద్వారా పొందుకొని ఆస్వాదించు ఆశీర్వాదమని, మరియు నిత్య జీవం ఆయనను ప్రేమించి ఆయన సేవ చేయువారికి దేవుడిచ్చు ఉత్తమ వరమని వారికి నేర్పించవలసియుంది. మానవుడు నిత్యజీవమును ఎన్నడు తన జ్ఞానంతోనో లేక తన స్వయం కృషితోనో పొందలేడు.

**వచనం 23.** మరింత అవిధేయతను నివారించుటకు, దేవుడు [వారిని] **ఏదెను తోట నుండి బయటకు వెళ్ళగొట్టెను**. "వెళ్ళగొట్టుటకు" ఉపయోగించబడిన క్రియాపదం שָׁלַח (*shalach*) లోనిది, దాని అర్థము "దూరంగా పంపుట" లేక "బహిష్కరణ." ఇస్సాకునకు ప్రత్యర్థులైన హాగరును, ఇష్మాయేలును, మరియు తన ఉంపుడుగత్తెల యొక్క ఇతర కుమారులను అబ్రాహాము వెళ్ళగొట్టినప్పుడు ఇదే పదం ఉపయోగించబడెను (21:14; 25:6). అంతేగాక, *shalach*లో అనుబంధం యొక్క బహిష్కరణ మరియు మరణం కూడ ఉంది, ఉదాహరణకు ఒక పురుషుడు తన భార్యకు విడాకులిచ్చి పంపివేయుట లేక ఇశ్రాయేలు ప్రజలు దేవుని తిరస్కరించి అబద్ధ దేవతలను ఆరాధించిరి గనుక దేవుడు వారిని చెరలోనికి పంపుట (యెష. 50:1; యిర్మీయా 28:16).[27]

తోటలో నుండి వెళ్ళగొట్టబడిన తరువాత, అతడు ఏ **నేలనుండి తీయబడెనో దాని సేద్యపరచుట మనుష్యుని యొక్క పని**. ఆదాము మరియు హవ్వలు వారికి దేవునితో ఒకప్పుడు ఉన్న అనుబంధాన్ని మాత్రమే కోల్పోలేదు, వారికి స్నేహపూర్వకంగా లేని కష్టమైన వాతావరణంలోనికి వారు పంపబడిరి. పూర్వం, ఆదాము తోటలో తక్కువ పని చేస్తేనే సమృద్ధిగా ఫలాలు వచ్చేవి, కానీ ఇప్పుడు అతడు ఆరంభం నుండి మొదలుపెట్టి శపితమైన మరియు తన ఉత్తమ శక్తిని ఎదురించు నేల నుండి మొదలు పెట్టవలసియుంది. మొదటి స్త్రీ మరియు పురుషుడు దేవుని నమ్ముటలో విఫలమై, ఒక చెట్టు ఫలమును తినవద్దని చెప్పిన దేవుని ఆలోచనలను కూడ సందేహించారు. దానికి పరిణామంగా, కష్టమైన స్నేహపూరితం కాని లోకమును పొందారు. కేవలం దేవుని కృప వలన మాత్రమే ఈ గృహములేని దంపతులు తలదాచుకొను స్థలమును పొందారు.[28]

**వచనం 24. దేవుడు ఆదామును తోట నుండి వెళ్ళగొట్టెను.** 22వ వచనం నుండి 24వ వచనం వరకు స్త్రీని గూర్చిన ప్రస్తావన లేకపోవుట వింతగా ఉంది, ఎందుకంటే తన భర్తతో కలిసి ఆమె కూడ తోటలో నుండి బహిష్కరించబడెను. మంచి చెడ్డల తెలివినిచ్చు జ్ఞానవృక్షము యొక్క ఫలము తినవద్దను నిషేధమును వాస్తవికంగా ఆదాము పొందెను కాబట్టి ఆదాముపై దేవుని తీర్పు వక్కాణించబడియుండవచ్చు (2:17). జీవవృక్షం యొక్క ఫలము తీసుకొని తిని మరణ శిక్షను అడ్డుకొనుటకు ప్రయత్నించగలవాడు మానవుడే అనేది మరొక

సూచన.

దేవుడైన యెహోవా జీవవృక్షమునకు పోవు మార్గమును కాయుటకు కెరూబులను ఉంచి దానిని చేరుటను నిరోధించెను. తోటకు ప్రవేశం తూర్పు[29] వైపున ఉంది, మరియు అక్కడే కెరూబులు ("కెరూబు"కు బహువచనం) ఉంచబడెను. కెరూబులు ("కెరూబు"కు బహువచనం) అను పదం బైబిల్లో తొంబది సార్లు కనిపిస్తుంది. ఇది దేవుని పరిశుద్ధతను సంరక్షించు రెక్కలు కలిగిన మిశ్రమ దేవదూతలను సూచిస్తుంది. ప్రత్యక్ష గుడారంలో, నిబంధన మందసంపై దేవుని సింహాసనంగా చిత్రాత్మకంగా పనిచేయు రెండు బంగారపు కెరూబులు ఉండేవి (నిర్గమ 25:18–22; మరియు వాటి ఒక పెద్ద జంట, ఒలీవ చెక్కపై చెక్కబడి బంగారపు పూత గలవి, సొలొమోను దేవాలయం యొక్క అతిపరిశుద్ధ స్థలములో నిలిచియుండేవి (1 రాజులు 6:23–28).[30]

ఇటు అటు తిరుగుచున్న ఖడ్గజ్వాల దేవుని తీర్పును సూచిస్తుంది. అక్రమంగా ప్రవేశించిన వారికి అది మరణపు ముప్పుగా ఉంది.[31] ఈ సన్నివేశం యొక్క విషాద వ్యంగ్యత ఏమిటంటే, ఆదాము వాస్తవంగా తోటను "సేద్యపరచుటకు" (שָׁמַר, *shamar*) అక్కడ ఉంచబడెను (2:15), కాని ఇప్పుడు కెరూబులు మరియు "ఖడ్గజ్వాలలు" అతని నుండి దానిని "సంరక్షించుటకు" (שָׁמַר, *shamar*) అక్కడ ఉంచబడెను.

## అన్వయము

### మనుష్యుని ఎంపిక (2:9, 16, 17; 3:1–24)

*"నా జీవితం యొక్క కేంద్రం ఏమైయుంటుంది?"* జీవితానికి కేంద్రము ఏమైయున్నది అను పరీక్షను తోట మధ్యలో ఉన్న మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షము ఉంచినది: దేవుడు లేక స్వయం. దేవుడు ఆత్మైయున్నాడు (యోహాను 4:24); కాని ఆయన భౌతిక ప్రపంచమును మరియు దానిలోని ప్రతిదానిని చేసిన సృష్టికర్త కూడా. ఆయన తన స్వరూపమందు నరుని సృష్టించినప్పుడు, ఆయన కేవలం భౌతిక జీవినిగా మాత్రమే చేయలేదుగాని, జీవితమును గూర్చి నిర్ణయాలు తీసుకొనగల నైతిక మరియు ఆత్మీయ జీవిని కూడ చేసాడు.

స్వేచ్ఛాచిత్తము ఒక గొప్ప వరము, కాని అది తప్పు నిర్ణయాలకు తగిన పరిణామాలు తెచ్చు తెలివిగల బాధ్యతలను కూడ తెస్తుంది. మనం దానిని గ్రహించినా గ్రహించకపోయినా, మన జీవితాలు మరియు మన బాహ్య క్రియల వెనుక, సామాన్య సమస్య అదే ప్రశ్న: "నన్ను ఎవరు పాలిస్తారు: సృష్టికర్త లేక నేనా?" ఆ ప్రశ్న వెనుక ఎల్లప్పుడూ నరుని గర్వం ఉంటుంది, మరియు వ్యక్తి యొక్క అహమును దెబ్బతీసి అతని హృదయమును లోపరచుకొని మరియు

అతడు దేవునికి ఎదురు తిరుగునట్లు చేయుట సులువైన మార్గమని సర్పమునకు తెలియును. (సాతాను యొక్క ప్రాథమిక పాపం అహంకారం అని తెలుపు సామెతలు 16:18 మరియు 1 తిమోతి 3:6ని చూడండి.) మొదటి దంపతులు "మంచి చెడ్డలను తెలుసుకొని," దేవుని వలె జ్ఞానులవుతారని సర్పము వారికి చెప్పినప్పుడు, ఇది వారికి ఇబ్బందికరమైన విషయమని వానికి తెలుసు. శోధన కేవలం ఈ మాటలలో చెప్పబడలేదు, కాని దాని భావము ఎల్లప్పుడు ఇమిడియుంది: వారికి వారే దేవునిగా ఉంటూ, ఆజ్ఞలు మరియు నిషేధముల నుండి విముక్తికలిగియుండాలని ఎవరు ఆశపడరు? అది సాధ్యమైతే, ప్రజలందరు వారికిష్టమైన బాటలో నడుస్తూ, వారికిష్టమొచ్చినట్లు చేస్తూ, ఎవరికీ జవాబుదారులు కాకుండా ఉంటారు. అయితే, అలాంటి విధానం సరిగా పనిచెయ్యదు. నిజమైన దేవునికి వేరుగా తమకు తామే దేవుడుగా ఉండాలని మానవుడు ఎంతగా ప్రయత్నిస్తే, అంతగా అతడు దెయ్యం వలె మారతాడు. స్వాతంత్ర్యంగా విడిచిపెట్టబడిన మానవుడు, చాల త్వరగా నాశనకరమైన పాప బంధకములకు బానిస అవుతాడు (కయీను మరియు అతని సంతతివారిని జలప్రళయమునకు నడిపించునట్లుగానే; 4:8, 23, 24; 6:4, 5, 11–13).

*"నేను దేవుని నమ్ముతానా?"* నిషేధించబడిన చెట్టు అనుబంధాలకు పరీక్షగా ఉంది. "మంచి మరియు చెడ్డల" జ్ఞానం యొక్క అర్థం, దేవుడు మాత్రమే కలిగియున్న జ్ఞానము, అనగా సమస్తం తెలుసుకొను శక్తి కావచ్చు. అట్టి జ్ఞానం మానవుడు కలిగియుండలేడు–ఒకవేళ అతని యొద్ద ఉన్నా, దానిని అతడు సంభాళించలేడు. కాబట్టి, నిషేధించబడిన చెట్టు దేవునితో మానవుని అనుబంధానికి పరీక్షగా ఉంది, మరియు దానిలో నమ్మకం ఇమిడియుంది. దేవుడు మంచివాడని మరియు ప్రేమస్వరూపియని మరియు తనకు ఉత్తమైనది ఇస్తాడని విశ్వసించి, మానవుడు దేవుని నమ్మగలడా, లేక ఏదెనులో సర్పము సూచించినట్లు దేవుడు స్వార్థపరుడని, గొప్ప అనుభవం పొందకుండా మనుష్యుని మోసం చేస్తున్నాడని ఆలోచిస్తాడా?

దేవుని నమ్ముట మానవునికి మరియు ఆయనకు మధ్య ఉన్న అనుబంధానికి ఎల్లప్పుడూ మూలముగా ఉంటుంది. అది ముఖ్యంగా రెండు బైబిల్ ఉదాహరణలలో కనిపిస్తుంది.

నోవహునరులందరిని నాశనం చేయుటకు భూమిపై జలప్రళయం వస్తుందని చెప్పిన దేవుని హెచ్చరికను నోవహు నమ్ముటకు నిర్ణయించుకొనెను. అలా చేయుట ద్వారా అతడు తన సమాజం యొక్క సామాన్యమైన తెలివి మరియు జ్ఞానమునకు విరోధముగా వెళ్ళవలసివచ్చెను వెళ్ళవలసివచ్చెను (మత్తయి 24:35–39; హెబ్రీ. 11:7; 2 పేతురు 3:3–7).

మోషే కూడా దేవుని నమ్ముటకు నిర్ణయించుకొనెను. ఐగుప్తుకు తిరిగివెళ్లి హెబ్రీ ప్రజలను బానిసత్వం నుండి విడిపించుటకు మానవ ఆలోచనను బట్టి

అతనికి తెలిసిన ప్రతి విషయమునకు విరోధముగా ఆయన వెళ్ళవలసివచ్చెను. అతడు న్యాయం నుండి పరారిలో ఉన్నవాడు, ప్రపంచంలో ఐగుప్తు అత్యంత శక్తివంతమైన దేశముగా ఉండెను, మరియు అరణ్యంలో నలుబది సంవత్సరాలుగా గొర్రెలను మేపుచున్న ఒక వ్యక్తి యొక్క డిమాండ్లకు ఫరో ఎన్నటికి స్పందించడు. దేవుడు వారిని నిజముగా విమోచించునని ఆయన హెబ్రీ ప్రజలకు ఎలాంటి హామీ ఇవ్వగలడు? (నిర్గమ. 3:16–4:31; 6:1–9 చూడండి) విమోచన ప్రక్రియలోని ప్రతి అడుగులోను నమ్మకం ఇమిడియుంది: ఐగుప్తీయులపై వచ్చిన తెగుళ్ల నుండి (నిర్గమ. 8:1–12:36), ఫరో సైన్యము యొక్క కోపము నుండి, మరియు తమను వెంబడించిన వారిని ముంచిన సముద్రము నుండి దేవుడు ఇశ్రాయేలు ప్రజలను రక్షిస్తాడను నమ్మకం (నిర్గమ. 14:10–31). అరణ్యంలో, వారు నశించకుండునట్లు దేవుడు వారికి నీరు, మన్నా, మరియు పూరేళ్ళను ఇస్తాడని మోషే మరియు ప్రజలు దేవుని నమ్మవలసియుండెను. సీనాయి పర్వత మార్గంలో వారిని హతమార్చుటకు పొంచియున్న అమాలేకీయులపై ఆయన వారికి జయమునిచ్చునని వారు ఆయనను నమ్మవలసియుండెను (నిర్గమ. 15:22–17:13; హెబ్రీ. 11:24–29).

తన హృదయంలో తాను ఇశ్రాయేలు ప్రజల శ్రేయస్సును కోరిన ప్రేమించు దేవుడనని దేవుడైన యెహోవా మరలా మరలా తన స్వభావమును వ్యక్తపరచెను. అయినను, ఆయన వారిని ఐగుప్తు నుండి అరణ్యంలోనికి హతమార్చుటకు తీసుకొనివచ్చెనని, వారు మాటి మాటికి ఆయనకు విరోధముగా సణిగిరి. చివరికి, వాగ్దాన దేశం యొక్క పొలిమేరలలో బసచేసినప్పుడు, దేవుడు వారికి జయమునిచ్చునని విశ్వసించక దానిలోనికి ప్రవేశించుటకు నిరాకరించినప్పుడు, దేవుడైన యెహోవా మోషేతో ఇలాగు అనెను, “ఎన్నాళ్లవరకు ఈ ప్రజలు నన్ను అలక్ష్యము చేయుదురు? ఎన్నాళ్లవరకు నేను వారి మధ్యను చేసిన సూచిక క్రియలన్నిటిని చూచి నన్ను నమ్మకయుందురు?” సంఖ్యాకాండము 14:11లో “నమ్మిక” అని అనువదించబడిన పదానికి “విశ్వాసం” అను భావం ఉంది. ప్రజలు దేవుని జ్ఞానపూరితంగా విశ్వసించిరి, మరియు ఆయన గొప్ప సూచిక క్రియలు చేసెనని వారికి తెలుసు; అయినను వారు ఆయనను నమ్మలేదు, ఎందుకంటే వారు తమ జీవితాలను మరియు భవిష్యత్తును ఆయన హస్తములలో సమర్పించుటకు అయిష్టులుగా ఉండిరి.

తన వ్యక్తిగత పరిచర్యలో, యూదా ప్రజలలో యేసు అదే నమ్మికలేమిని గమనించెను. పస్కా పండుగ సమయంలో, అనేకులు “ఆయన నామమును విశ్వసించిరి – [ἐπίστευσαν, *episteusan*], ఆయన చేసిన సూచిక క్రియలను గమనించిరి; అయితే యేసు అందరిని ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము [ἐπίστευεν, *episteuen*] చేసికొనలేదు” (యోహాను 2:23, 24). యోహాను ద్వారా అనిశ్చయ కాలంలో ఉపయోగించబడిన మొదటి క్రియ, “మొన

చెర్య"ను, క్షణమాత్రపు నమ్మిక లేక విశ్వాసమును సూచిస్తుంది. రెండవ పదం కూడ అదే మాటలోనిది, మరియు అది ఎక్కువగా "నమ్ము" అని అనువదించబడుతుంది; అయితే, అసంపూర్ణ కాలంలో, అది విశ్వసించు, నమ్ము, అప్పగించు, లేక ఒకరికి సమర్పించుకొను నిరంతర చర్యను సూచిస్తుంది. యేసుకు వారి విశ్వాసం పై విశ్వాసంలేదని లేక వారు యేసుకు అప్పగించుకొనరు (లేక సమర్పించుకొనరు) కాబట్టి యేసు తన్ను వారి వశము చేసుకొనడని యోహాను చెప్పుచున్నాడు. రక్షించు విశ్వాసం కేవలం ఆయన ఉనికికి మరియు ఆయన చేయు సూచిక క్రియలకు మానసిక అంగీకారం కాదు; దానిలో క్రీస్తును నమ్ముట మరియు ఆయనకు అప్పగించుకొనుట ఉండవలెను.[32]

చరిత్రలో జరిగినట్లే, ఇలాంటి విశ్వాసమును గూర్చిన విషయమే ఆదాము మరియు హవ్వలను ఎదుర్కొనెను. దేవుడు సృష్టికర్త అని మరియు వారి జీవితాలు, వారి పరిసరాలు, మరియు వారి యొద్ద ఉన్న ప్రతిదానికి వారు ఆయనకు ఋణపడియున్నారని వారికి తెలుసు. అయినను, వారికి ఉత్తమమైనది తెలుసుకొనుటకు దేవుని మాట విని ఆయనను నమ్ముటకు బదులుగా వారు తమ సొంత నిర్ణయాలు తీసుకోవాలని ఆశించిరి.

*"నేను దేవుని ఆజ్ఞలను పాటిస్తానా?"* నిషేదించబడిన చెట్టు ఆజ్ఞకు పరీక్షగా నిలిచియుండెను. ఈ విషయంలో, మొదటి దంపతుల యొక్క పరీక్ష వ్యతిరేకార్థమైనది: నిషేధించబడిన వస్తువు. వారు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలమును తినకూడదని వారికి చెప్పబడినది. పరీక్ష యొక్క ప్రాముఖ్యత నిషేధించబడిన చర్యలో లేదు, ఎందుకంటే ఆ చెట్టు ఫలము తినుట మాత్రమే అనైతికము లేక పాపం కాకపోవచ్చు. 6వ వచనం చెబుతుంది, "స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు అని చూచినప్పుడు," ఆమె దాని ఫలములోని కొన్ని తీసుకొని తినెను. తరువాత తన భర్త ఆస్వాదించుటకు కొన్ని తెచ్చెను. ఫలము విషపూరితం కాదు లేక కుళ్ళినది కాదు, కాని రమ్యమైనది మరియు రుచికరమైనది.

దేవుడు దానిని వారికి ఇచ్చెను అనునది నిషేధ బిందువు. మనుష్యుడు ఏమి తినుట మంచిదో కాదో నిర్ణయించు హక్కు ఆయనకు మాత్రమే ఉన్నది. దేవుని ఆజ్ఞలు ఆయన వెలుపల ఉన్న తప్పు ఒప్పులతో శాసించబడలేదు. దేవుడు నరుని చెయ్యమని చెబితే అది ఒప్పు మరియు నిషేధిస్తే అది తప్పు ఆయన మరి ఏ ఉన్నత ప్రమాణమును స్థాపించలేదు.

మంచి చెడ్డల జ్ఞానమునిచ్చు వృక్ష ఫలము తినుట నుండి నిషేధము మానవుడు దేవుని నమ్మి ఆయనతో అనుబంధమును గౌరవించునో లేదో చూచుటకు పరీక్ష. పరిమితిలులేకుండా మానవుడు అతి త్వరలో తన్ను తాను సృష్టియంతటికి మూలముగా ఎంచుకొనునని దేవునికి తెలుసు; వారి జీవితాలు ఆయనపై గాక స్వయం–కేంద్రీకృతమవుతాయి; మరియు ప్రతిది వారి ఆశలు

మరియు తలంపుల చుట్టు తిరగాలని వారు అనుకుంటారు. ఒకసారి మానవుని దృష్టి తన స్వార్థం పై పడితే, అతడు కేవలం తనని గూర్చి మాత్రమే ఆలోచిస్తూ తన స్వార్థములను నెరవేర్చుటకు ఇతరులను వాడుకుంటాడు. అతని చుట్టు ఉన్నవారి యొక్క అవసరతలను పట్టించుకొనడు. క్లుప్తంగా, అతడు దేవుని వలె మారుటకంటే ఎక్కువ దెయ్యము వలె మారతాడు.

తల్లిదండ్రులు పిల్లలను ఘోరమైన సమస్య నుండి కాపాడుటకు స్వేచ్ఛా నియమాలుగా లేక నిబంధనలుగా పది ఆజ్ఞలను చూస్తారు. ఆదాము, హవ్వలను "మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలము" తినుట నుండి నిషేదించుటలో దేవుని తలంపులను సర్పము ఖండిచినట్లే, కొన్ని సార్లు పిల్లలు తమ తల్లిదండ్రులు నియమించిన నైతిక నియమాలను ప్రశ్నిస్తారు. స్వేచ్ఛా నియమాలకు భిన్నంగా, నైతిక నియమాలు దేవుని అస్తిత్వము మరియు స్వభావము నుండి పుడతాయి. నైతికంగా, ఆయనలో ఆయన నిత్యము స్థిరమైనవాడు. దేవునిలో "ఏ చంచలత్వమైనను గమనాగమనములవలన కలుగు ఏ ఛాయయైనను లేదు," అని యాకోబు చెప్పెను (యాకోబు 1:17). పది ఆజ్ఞల వంటి నిబంధనల వెనుక ఉన్న నియమాలలో దేవుని స్వభావం ప్రతిబింబిస్తుంది కాబట్టి అవి నిత్య సత్యాలు.

దేవుడు మానవునికి తోటలో ఒక ఆజ్ఞ ఇచ్చెను. మొదటి దంపతులు దానిని స్వేచ్ఛాపరమైనదిగా ఎంచి దానిని ఉల్లంఘించినప్పుడు, ఘోర పరిణామాలు ఎదుర్కొన్నారు. అది అబద్ధమాడుటకు, హేతుబద్ధీకరణకు, ఒకరి నుండి మరొకని మీదికి నెపం మోపుటకు, సర్పము మీదికి, మరియు తరువాత దేవుని మీదికి నెపం మోపుటకు దారితీసింది. పాపమంతా, అది స్వేచ్ఛాపరమనిపించు ఆజ్ఞ లేక నైతిక ఆజ్ఞల ఉల్లంఘనలో, సత్యము వక్రీకరించబడుతుంది. ఆదాము హవ్వలు వారి స్వభావమునకు సాకులు చెప్పి దేవునికి, తమకుతాము, లేక ఒకరికొకరు "నమ్మకస్తులుగా" నిలువబడలేదు.

మానవుడు తనతో తాను మరియు ఇతర మానవ అనుబంధాలతో సామరస్యం కలిగి జీవించియుండాలనుటకు సత్యము మరియు నిజాయితీ కలిగిన యేసు జీవితము దృష్టాంతముగా ఉంది. మానవుల మధ్య సత్యములేకుండా ఏ గృహము లేక సమాజము ఎక్కువ కాలం ఉండలేదు. "ధర్మశాస్త్రములోని బరువైన నియమాలు" (మత్తయి 23:23) మరియు "ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ" మత్తయి 22:38 మనం ఏ విధంగా ఉండాలని సృష్టించబడ్డామో ప్రతిబింబిస్తాయి. మనం దేవుళ్ళగుటకు లేక అందరి దృష్టిలో ఉండుటకు సృష్టింపబడలేదు. మన జీవితమంతా మనలను మనం మెప్పించుకొనుచు బ్రతుకుటకు బదులుగా, దేవుని ప్రేమించుట (ఆయనను మన జీవితములో కేంద్రముగా పెట్టుట) మరియు మనలను వలె మన పొరుగువారిని ప్రేమించుట మన జీవితాలకు ప్రాథమిక ఆజ్ఞలు. దీనికి మొదట దేవుని వైపు పైకి చూచు జీవితాలు మరియు తరువాత బయట ఉన్న పొరుగువారి వైపు చూచు జీవితాలు

అవసరం. మనం పరిశుద్ధత, నీతి, కరుణ, మరియు దయను ప్రతిదినము అభ్యసించవలెను. ఈ లోకంలో మనం దేవుని స్వభావం మరియు గుణమును ప్రతిబింబించాలి, తద్వారా మన దేవుడు ఎంత అద్భుతమైనవాడో ప్రజలు చూసి ఆయనను మహిమపరచాలి (మత్తయి 5:16, 33–48; లూకా 6:35, 36).

## దేవుని ఎన్నుకొనుట – జీవితాన్ని ఎన్నుకొనుట (3:1–13)

ఆదాము హవ్వలు నిషేదించబడిన వృక్షమును చూచినప్పుడు, వారు జీవ – మరణ నిర్ణయాన్ని ఎదుర్కొన్నారు. ప్రజలు జీవమును కోరతారు – కాని అనేకులకు అది వారి షరతులకు అనుగుణంగా కావాలి. వారికి సరైనది అని తోచినంత వరకు వారు దేవుని మార్గములను అంగీకరించుటకు సిద్ధపడతారు: దాని డిమాండ్లు కష్టముగా లేకుండా, వారు తమ ఇష్టాలను చేయగలిగి వారి మార్గములను వారు నిర్మించుకొనగలిగితే అంగీకరిస్తారు. ఆదాము హవ్వలు కూడ ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ఎందుకంటే, దేవుని మార్గం న్యాయమైనది కాదని సర్పము చెప్పెను. శోధకుని మాటల ప్రకారం, వారు మరణమును గూర్చి దేవుని మాటలను అపార్థం చేసుకొనియుండాలి లేక నిషేధించబడిన వృక్షఫలము తినుట వారిని ఆయన వలె చేస్తుంది కాబట్టి దేవుడు అబద్ధమాడి ఉండాలి.

కేవలం రెండు మార్గములు – జీవం లేక మరణం – ఉండుట కఠినమని సర్పము ఉద్దేశించెను. కేవలం ఈ రెండు వికల్పాలు మాత్రమే ఉన్నాయని చెప్పిన దేవుని హెచ్చరికలను ఆదాము విన్నప్పటికి, దేవుడు గాక, సర్పము సత్యము చెప్పుచున్నదని హవ్వ చెప్పిన మాటల ద్వారా ఆదాము ప్రభావితుడైయ్యాడు. ఆదాము హవ్వలు ఆ వృక్షఫలమును తీసుకొని తిన్నవెంటనే, వారికి తెలియకుండానే వారు మరణమునకు పోవుమార్గమును ఎంచుకున్నారు. ఇదే సామాన్య ఎంపిక ఎల్లప్పుడూ మానవజాతిని ఎదుర్కొనెను. ఇది మనలో ప్రతివారిని నిర్ణయము తీసుకొనుటకు ఆహ్వానిస్తుంది: జీవం లేక మరణం, నీవు దేనిని ఎన్నుకుంటావు?

జీవమునకు నడుపు ఆయన మాటలు తన పిల్లలు వినాలని దేవుడు కోరుచున్నాడు. లేఖనములలోని అనేక ఉదాహరణలలో చూసినట్లు కొన్ని సార్లు ఆయన నిబంధనలు అర్థం చేసుకొనుటకు కష్టం కావచ్చు.

*ఇశ్రాయేలు పస్కా పశువును సిద్ధపరచి వారి ఇళ్ళలోపల దానిని భుజించాలి, మరియు దాని రక్తమును ద్వారబంధపు కమ్మిల మీద చల్లవలెను.* ఈ దైవిక సూచన పాటించినవారికి జీవం వాగ్దానం చేయబడెను; కాని దానిని పాటించని వారి యొక్క మనుష్యులలో మరియు జంతువులలో తొలి సంతతి హతముచేయబడును (నిర్గమ. 12:1–14, 28–30 చూడండి). ఖండితమైన మానవ కోణంలో చూస్తే, అవి అర్థంలేని ఆజ్ఞల వలె ఉన్నాయి. అయితే, ఆ

హెచ్చరిక నిజమైయింది: రక్తము క్రింద వున్నవారు, పస్కా భోజనం చేసినవారు మాత్రమే దేవుని తీర్పును తప్పించుకున్నారు.

*ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచి వెళ్ళుచున్నప్పుడు ఫరో హృదయం కఠినపరచబడెను.* తప్పించుకొనుటకు ఎలాంటి మార్గములేని సముద్రము యొద్దకు ఆయన వారిని వెంబడించెను. కర్రను ఎత్తి ప్రజలను సముద్రం వైపు నడుపమని దేవుడు మోషేకు సూచించెను. మరొకసారి, అది జీవన్ మరణ పరిస్థితి: అయితే అది ఒక ఆశ్చర్యకరమైన నిర్ణయం: సముద్రము వైపునకు నడచుట ఖచ్చితమైన మరణము వలె కనిపించినప్పటికీ, వాస్తవానికి జీవమార్గమాయెను. ఫరోకు లొంగిపోయి ఐగుప్తునకు తిరిగివెళ్ళుట మాత్రమే జీవించుటకు ఏకైక మార్గమనిపించెనుగాని, అది నిజముగా మరణానికి నడిపియుండవచ్చు.

*ఇశ్రాయేలు పిల్లలు వాగ్దాన భూమిలో ప్రవేశించుటకు ముందు మోషే చేసిన చివరి ప్రసంగంలో, ఇతర దేవతలను ఆరాధించవద్దని ఆయన వారిని హెచ్చరించెను.* ఒకవేళ వారు ఆ శోధనకు లొంగిపోయినయెడల, వారు స్వాధీనంచేసుకొనబోవు దేశంలో వారు నశిస్తారని ఆయన ప్రకటన చేసెను. తన ప్రసంగం చివరిలో, మోషే ఇలా అనెను,

> నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుటను ఉంచి, భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచుచున్నాను. నీ పితరులైన అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఆయన ప్రమాణము చేసిన దేశములో మీరు నివసించునట్లు యెహోవాయే నీ ప్రాణమునకును నీ దీర్ఘాయుస్సుకును మూలమైయున్నాడు. కాబట్టి నీవును నీ సంతానమును బ్రదుకుచు, నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లును జీవమును కోరుకొనుడి (ద్వితీ. 30:19, 20).

దేవుని ప్రేమించి, ఆయన స్వరమును విని, ఆయనను హత్తుకొనుట ద్వారా మరణం మరియు శాపమునకు పైగా జీవమును మరియు ఆశీర్వాదములను కోరవలెనని ప్రజలకు హెచ్చరించబడెను. అలా చేయుట ద్వారా, వాగ్దాన దేశంలో వారు దీర్ఘాయుస్సు మరియు ఎక్కువ కాలం జీవించి వెలిపేత, మరణం, మరియు శాపములను తప్పించుకొనగలుగుతారు. మోషే ఇశ్రాయేలుకు ఏమి చెయ్యవద్దని చెప్పెనో దానికి వ్యతిరేకంగా చేసిన ఆదాము హవ్వల అనుభవాన్ని ఈ వాక్యభాగం ప్రతిధ్వనిస్తున్నట్లు అనిపిస్తుంది. వారు దేవుని మాట వినుట నిరాకరించి తోటలోని దీర్ఘాయుస్సును మరియు ఆశీర్వాదములను పోగొట్టుకొని మరణమును మరియు శాపములను కోరుకొనిరి.

*యేసు పరిచర్య సమయంలో, ఇరుకు మార్గం జీవమునకు నడుపుతుందని*

మరియు విశాల మార్గం నాశనమునకు (మరణం) నడుపుతుందని ఆయన బోధించెను (మత్తయి 7:13, 14). “కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును” (యోహాను 3:36). క్రీస్తును పంపిన దేవుని మాట విని ఆయనయందు “విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు: వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు” (యోహాను 5:24). యేసు జీవమునకు మార్గమైయున్నాడు (యోహాను 14:6), అయితే ఆయనయందు విశ్వాసముంచుటకు నిరాకరించువారు వారి పాపములలో మరణించుదురు (తప్పిపోతారు). ఆయన వెళ్ళు చోటికి, అనగా పరలోకమునకు వారు వెళ్ళలేరు (యోహాను 8:21, 24).

జీవస్మరణం మధ్య ఎంపికను మనం ఎదుర్కొన్నప్పుడు, మనం జీవం ఎన్నుకొనుటకు బలవంతపెట్టబడుచున్నాము. మనం మరణించవలసిన పని లేకుండా యేసు మరణించెను. ఆయనలోని జీవమును మనం ఎన్నుకుందాం.

## అహంకారం అను పాపం (3:5, 6)

అహంకారం, దేవుని పై బాహ్య తిరుగుబాటుకు వెనుక ఉన్న సాధారణ పాపమని అనిపిస్తుంది. తూరు దేశ రాజు పై చేసిన ఆక్షేపణలో ఇది నాటకీయంగా వ్యక్తపరచబడెను, అతడు గర్వముతో నిండినవాడై, తన హృదయంలో “నేనొక దేవుడిని , దేవుళ్ల పీఠములపై నేను ఆసీనుడనైయున్నాను” అని అనుకొనెను, కాని ఆయనకు ఇలా చెప్పబడెను, “నీవు దేవుడవు కాక మానవుడవై యుండియు దేవునికి తగినంత అభిప్రాయము కలిగియున్నావు” (యెహెజ్కేలు 28:2). యెహెజ్కేలు గొప్ప సింబాలిక్ భాషను ప్రయోగించి ఈ అన్యదేశపు రాజును, దేవునియంత జ్ఞానులు కావాలని ఆశించి పాపముచేసిన ఏదెను తోటలోని మొదటి నివాసులతో పోల్చుచున్నాడు[33]: దేవుని తోటయగు ఏదెనులో నీవుంటివి ... నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు యథార్థవంతుడవుగా ఉంటివి (యెహెజ్కేలు 28:13–15).

రాజు యొక్క అహంకార హృదయమును గూర్చి ప్రవక్త దీని తరువాత మరొక ప్రతిపాదన చేసెను: “నీ సౌందర్యము చూచుకొని నీవు గర్వించినవాడవై, నీ తేజస్సు చూచుకొని నీ జ్ఞానమును చెరుపుకొంటివి, కావున నేను నిన్ను నేలను పడవేసెదను, రాజులు చూచుచుండగా నిన్ను హేళనకప్పగించెదను” (యెహెజ్కేలు 28:17). అందువలన, అతడు తన అలంకారిక ఏదెను తోటను కోల్పోయి దేవతల మధ్య ఉన్న తన ఉన్నత సింహాసనము నుండి నేలకు పడవేయబడునని ఈ దుష్ట రాజుపై దేవుడు దైవిక శిక్షను ప్రకటించెను. “సముద్రములో మునిగి చచ్చినవారివలెనే నీవు చత్తువు” అని రాజుకు శిక్ష విధించబడెను (యెహెజ్కేలు

28:8; 28:10, 19 చూడండి).

యేసు చెప్పినట్లు, ఈ అబద్ధమే ఆరంభము నుండి మానవులను ప్రలోభపెట్టెను (యోహాను 8:44): మానవులు, గర్విష్ఠులై, దేవుని నుండి స్వతంత్రులుగా ఉండి తమ ఇష్టానుసారంగా జీవించవచ్చని అనుకుంటారు. వారి అవిధేయతకు శిక్ష వస్తుందను భయంలేకుండా వారు పాపం చెయ్యవచ్చని వారనుకుంటారు. అయితే, మరలా మరలా, "మీ పాపము మిమ్మును పట్టుకొనును" అను సత్యము యొక్క సాక్షం మానవ అనుభవాలలో మనం చూడవచ్చు (నిర్గమ. 32:23). గొప్ప విషాదం ఏమిటంటే, పాపము యొక్క జీతం స్వతంత్రం మరియు జీవం కాదుగాని నిత్య మరణం మరియు బాధ (రోమా 6:23), ఇది మానవులందరికి సంప్రాప్తమాయెను (రోమా 5:12).

---

సూచనలు

[1]Robert L. Alden, "שָׁגָה," in *TWOT*, 2:571. [2]ఈ కథలో, గిల్గామేషు అను చిన్న – దైవ రాజు, తన వృద్ధాప్యంలో దానిని తిని మరలా యవ్వనుడగుటకు సహాయపడు మొక్కను వెదకుటకు సముద్ర గర్భములోనికి ప్రయాణం చేసెను. ఆ మొక్కతో ఇంటికి తిరిగి ప్రయాణం చేస్తున్నప్పుడు, ఒక లోతైన కోనేరులో సేదతీరాలని ఆశించాడు. అతడు నీటిని అస్వాదిస్తుండగా, ఒక సర్పము అ మొక్క సువాసన పసిగట్టి, దానిని లాగుకొని తినెను. అందువలన ఆ జీవి తన చర్మము విడచి నూతనపరచబడెను. (*The Epic of Gilgamesh* 11.263–296.) [3]Wisdom of Solomon 2:23, 24 (NRSV). [4]Ronald B. Allen, "עָרוּם," in *TWOT*, 2:697–98. [5]రోమా. 5:12–19లో మొదటి పాపంయొక్క నిందను పౌలు ఆదాము పై వేసెను. [6]వాస్తవిక ఆజ్ఞలో దేవుడు చెట్టును ముట్టవద్దని చెప్పియుండవచ్చుగాని, రచయిత ఉద్దేశపూర్వకంగా ఈ విషయమును 3:3 వరకు బయలుపరచలేదు. ఏదేమైనా, హవ్వ యొక్క స్పందన దేవుని ఆజ్ఞను అతిశయోక్తి చేసెనని అనువదించుట మరింత స్వాభావికంగా ఉంటుంది. [7]Robert L. Alden, "תַּאֲוָה," in *TWOT*, 1:18. [8]Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson (Boston: Brill, 2001), 2:1083. [9]"నీ తమ్ముడైన హేబెలు ఎక్కడున్నాడు?" (4:9) అని దేవుడు కయీనును అడిగినప్పుడు దేవుడు ఇలాంటి ప్రశ్ననే అడిగెనా. అన్న తమ్ముని హత్య చేసి తన నేరమును దాయుటకు అతని శరీరమును నేలలో దాచిన విషయం దేవునికి తెలియును. కాబట్టి, హేబెలు ఎక్కడ ఉన్నాడో తెలియదని కయీను నిరాకరించినప్పుడు, "నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొరపెట్టుచున్నది" (4:10) అని దేవుడు ఆయనతో అనెను. [10]Kenneth A. Mathews, *Genesis 1–11:26*, The New American Commentary, vol. 1A (Nashville: Broadman & Holman Publishers, 1996), 241.

[11]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 194. [12]H. C. Leupold, *Exposition of*

*Genesis*, vol. 1 (N.p.: Wartburg Press, 1942; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1953), 160. [13]"Targum of Palestine," in *The Targums*, trans. J. W. Etheridge (New York: KTAV Publishing House, 1968), 166. దానికి తోడుగా, దేవుడు "అతనికి కళ్ళు ఇచ్చుటకు నిరాకరించెను" అని Josephus వ్యాఖ్యానించెను (Josephus *Antiquities* 1.1.4). [14]Derek Kidner, *Genesis: An Introduction and Commentary*, The Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1967), 70. [15]Walter C. Kaiser, "זֶרַע," in *TWOT*, 1:253. [16]Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, 197. [17]H. D. Preuss, "זֶרַע," in *Theological Dictionary of the Old Testament*, trans. David E. Green, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1980), 4:150. [18]ఈ వచనమును క్లుప్తంగా చెబుతూ, the Targum of Jerusalem, "అయితే, స్త్రీ యొక్క కుమారులకు ఔషధం ఉంటుందిగాని, నీకు, సర్పమా, ఔషధం దొరకదు: కాని ఇట్టి వారి మడమకు రాజైన మసిహ్ [మెస్సీయ] దినములలో పరిహారం ఉంటుంది." The Targum of Palestine కూడ ఇలాంటి విషయమునే తెలియజేస్తుంది. (*The Targums*, 166.) [19]Jack P. Lewis, "The Woman's Seed (Gen. 3:15)," *Journal of the Evangelical Theological Society* 34, no. 3 (September 1991): 319. [20]William Sanford LaSor, "Prophecy, Inspiration, and *Sensus Plenior*," *Tyndale Bulletin* 29 (1978): 57.

[21]Gordon J. Wenham, "Genesis," in *New Bible Commentary: 21st Century Edition*, ed. G. J. Wenham, J. A. Motyer, D. A. Carson, and R. T. France (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 63. [22]Victor P. Hamilton, "תְּשׁוּקָה," in *TWOT*, 2:913. [23]Koehler and Baumgartner, 1:647. [24]Mark S. Howell, "Paradise Lost (Genesis 3–4)," in *Harding University Lectures* (1991): 35. [25]Jacob M. Myers, "Dress and Ornaments," in *The Interpreter's Dictionary of the Bible*, ed. George Arthur Buttrick (Nashville: Abingdon Press, 1962), 1:869. [26]ఈ కథనము పాపముచేసిన దేవదూతలను పరిగణలోనికి తీసుకోదు (2 పేతురు. 2:4; యూదా 6). [27]Hermann J. Austel, "שָׁלַח," in *TWOT*, 2:927–28. [28]Mathews, 257. [29]చాల కాలం తరువాత, ప్రత్యక్ష గుడారమునకు మరియు దేవాలయమునకు ద్వారములు తూర్పు దిక్కున ఉండేవి. [30]పురాతన సమీప తూర్పులో, కోటలు మరియు దేవాలయాలు కాపాడుటకు మిశ్రమ జీవుల యొక్క విగ్రహాలను ఉపయోగించేవారు. వీటికి సాధారణంగా మనుష్యుని ముఖం, గ్రద్ద రెక్కలు, సింహం లేక ఎద్దు యొక్క శరీరం ఉండేవి. (See David L. Roper, *Revelation 12–22*, Truth for Today Commentary [Searcy, Ark.: Resource Publications, 2002], 435.) అంతేగాక, పురాతన సమీప తూర్పు కళలో కూడ రెక్కలు కలిగిన జీవులు పవిత్రమైన చెట్టును సంరక్షించుట ఒక సామాన్య విషయం. (See John H. Walton, "Genesis," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Genesis, Exodus, Leviticus, Numbers, Deuteronomy*, ed. John H. Walton [Grand Rapids, Mich.: Zondervan, 2009], 2, 3, 37.)

[31]సంఖ్యాకాండము 22:23, 31, 33 లో ఖడ్గము కలిగిన దూత ఒకటి బిలాము యొక్క గాడిదను అడ్డుకొనెను. తమ శత్రువులపై దేవుని తీర్పు మరియు ఉగ్రతను

వివరించుటకు ద్వితీయోపదేశకాండము 32:41, 42 "ఖడ్గజ్వాలలను" గూర్చి మాట్లాడుతుంది. [32]వాస్తవిక గ్రీకు ప్రతులలో అధ్యాయాల విభజన లేదు; యోహాను 2:23–25 లోని ఆలోచన యోహాను 3లో కూడ కొనసాగుతుంది కాబట్టి, యోహాను మాట్లాడుతున్న యెరూషలేములోని యూదులలో నీకొదేము కూడ ఒకడు. యేసు చేసిన అద్భుతాల ఆధారంగా ఆయన దేవుడు పంపిన మానవుడని నీకొదేము నమ్మెను; కాని, కనీసం ఆ పరిస్థితిలో కూడ, ఆయన యొద్ద రక్షణపొందు విశ్వాసం లేదు ఎందుకంటే అతడు "నమ్ముటకు" నిరాకరించెను, అనగా యేసుకు తన్ను తాను సమర్పించుకొని తిరిగిజన్మించుట (యోహాను 3:1–5). [33]దేవుని వలె కావాలనే ఆశ యెషయా 14:4–23 లో కూడ చూడవచ్చు. అక్కడ కూడ ప్రవక్త పురాతన సమీప తూర్పును తన కృర ఆక్రమణలతో నాశనం చేసిన బబులోను రాజును గూర్చి ఇలాంటి వివరణయే ఇచ్చెను. తన ఊహ యొక్క గర్వం మరియు ఆహంకారంలో, అతడు ఆకాశ సింహాసనమునకు "దేవుని నక్షత్రములకు పైగా" ఎక్కిపోయెను; అయితే అతడు అంతటి ఎత్తు నుండి పడి "పాతాళములోని ఒక మూలకు త్రోయబడెను" (యెష. 14:13, 15).